శుక్రవారం
24-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 03
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రపంచ శాంతికి బ్రిక్స్ పాటుపడాలి: చైనా

శాంతి, స్థిరమైన ప్రపంచ అభివృద్ధి సాధనకోసం సంఘీభావం, సమన్వయాన్ని విస్తరించాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ ప్రారంభోత్సవానికి వీడియో లింక్ ద్వారా ప్రసంగించిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం సవాళ్లను సంయుక్తంగా ఎదుర్కోవాలని సూచించారు. 2 లో

కొత్త జిల్లాలకు
నిధుల కొరత

- సిబ్బంది కేటాయింపు అంతంత మాత్రమే
- పని భారంతో రెవెన్యూ సిబ్బంది ఉక్కిరిబిక్కిరి
- కారుణ్య నియామకాలపై మౌనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విపరీతమైన పనిభారంతో ఉక్కిరిబిక్కిరవుతున్న రెవెన్యూశాఖకు నూతన జిల్లాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడం, నిధుల కొరత ఇబ్బందులకు గురిచేస్తోంది. రాష్ట్రంలో నూతన జిల్లాల ఆవిర్భావంతో ఈ సమస్య మరింత జఠిలమైంది. కొత్త జిల్లాలకు అరకొర సిబ్బందితోనే సర్దుబాటు చేసి జగన్ సర్కారు చేతులు దులుపుకుంది. సరిపడా నిధులు, కనీస సౌకర్యాలు కల్పించకుండా చోద్యం చూస్తోంది. వాటిని అధిగమించడానికి రెవెన్యూ ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా 13 జిల్లాలను 26 జిల్లాలుగా విస్తరించింది. కొత్తగా వచ్చిన 13 జిల్లాలకు కలెక్టరేట్‌లు, సబ్‌కలెక్టరు/ఆర్డీవో కార్యాలయాలు ఏర్పడ్డాయి. వివిధ శాఖల జిల్లా కార్యాలయాలు, మండల కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి దాపురించింది. నూతనంగా ఏర్పడిన కార్యాలయాలకు సిబ్బందిని సరిపడా కేటాయించలేదు. నూతన జిల్లా కార్యాలయాల్లో మౌలిక సౌకర్యాల కోసం కోటి రూపాయల నిధుల్ని ప్రభుత్వం కేటాయించాలని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ డిమాండు చేస్తోంది. అధికారుల నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు సిబ్బందిపై పనిభారం పడుతోంది.

ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ నిధుల విడుదల ఏది?

రెవెన్యూ ఉద్యోగులు దాచుకున్న ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ నిధుల విడుదలలోనూ ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో ఉద్యోగులు ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వారి పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఇబ్బంది కలుగుతోంది. ఉద్యోగుల పెండింగ్ బకాయిలను ఏప్రిల్ 30లోగా విడుదల చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చినప్పటికీ ఆర్థికశాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును తిరిగి ఇవ్వడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కన్పిస్తోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం, ఉన్నతాధికారుల మధ్య సమన్వయ

- మిగతా 2 లో

వీడని రాజకీయ
ప్రతిష్టంభన

- చకచకా మారుతున్న మహారాష్ట్ర పరిణామాలు
- ఉద్ధవ్-షిండే వర్గాలుగా చీలిన శివసేన
- మీ వెంటే ఉంటాం : ఉద్ధవ్‌కు కాంగ్రెస్, ఎన్సీపీ హామీ

ముంబై : మహారాష్ట్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఈ పరిణామాలు అక్కడి మహా వికాస్ అగాడీ (ఎంవీయే) ప్రభుత్వం మనుగడకన్నా శివసేన పార్టీ అస్థిత్వంపైనే ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. ఉద్ధవ్ వర్గం, షిండే వర్గంగా చీలిపోగా ఆ పార్టీలో యుద్ధం తరహా పరిస్థితి ఉంది. ఠాక్రే, షిండే వైపు ఎంత మంది ఎమ్మెల్యేలు ఉన్నారనేది స్పష్టంగా తెలియడంలేదు. అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేకు కేవలం 13 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంటే తిరుగుబాటు చేసిన ఏక్‌నాథ్ షిండేకు 42 మంది మద్దతు ఉందని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎవరు ఏం చేస్తారన్న ఉత్కంఠ నెలకొంది. మహా వికాస్ అగాడీ (ఎంవీయే) ప్రభుత్వం కూలిపోతుందా? ఠాక్రే ఏం చేయబోతున్నారు? షిండే తదుపరి అడుగు ఏమిటన్న ప్రశ్నలు సర్వత్రా ఉత్కంఠ పెంచుతున్నాయి. ఇదిగో మా బలం/బలగం అంటూ షిండే తన వెంట ఉన్న ఎమ్మెల్యేల ఫొటోలు విడుదల చేశారు. వారితో ఆయన మాట్లాడుతూ మనకు ఓ జాతీయ పార్టీ అండదండలు ఉన్నాయని చెబుతున్న వీడియో ఒకటి బయటకు రావడం కూడా చర్చకు దారితీసింది. గురువారం మరో ముగ్గురు రెబల్ క్యాంపులో చేరిన క్రమంలో ఎమ్మెల్యేల సంఖ్య 42కు పెరిగిందని సమాచారం. అనర్హత నుంచి తప్పించుకోవాలంటే 37 ఎమ్మెల్యేల మద్దతు ఉంటే సరిపోతోంది. తమ బుజ్జగింపులు ఫలించని నేపథ్యంలో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఓ కీలక ప్రకటన చేశారు. అధికార

- మిగతా 2 లో

ఫిరాయింపుల నిరోధక చట్టానికి
సవరణలు అవశ్యం

- నాల్గో పేరా తొలగిస్తే తప్ప ప్రయోజనం శూన్యం
- అస్పష్టంగానే నిబంధనలు
- లొసుగులతోనే దుర్వినియోగం

2 లో

అగ్నిపథ్ వెనక్కి

- కేంద్ర కార్మిక సంఘాలు డిమాండు
- నేటి ఎస్‌కేఎం దేశవ్యాప్త సమ్మె పిలుపునకు మద్దతు

న్యూఢిల్లీ : అగ్నిపథ్ పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు డిమాండు చేశాయి. ఈ పథకానికి వ్యతిరేకంగా శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఇచ్చిన సమ్మె పిలుపునకు మద్దతిచ్చాయి. జూన్ 24న దేశవ్యాప్త ఆందోళన దినోత్సవంగా పాటించాలన్న ఎస్‌కేఎం పిలుపునూ సమర్థించాయి. ఈ మేరకు గురువారం సంయుక్త ప్రకటనను వెలువరించాయి. ఎనిమిదేళ్లలో సామాన్యులను ఇబ్బంది పెట్టే విధానాలనే మోదీ ప్రభుత్వం అమలు చేసిందని, ఫలితంగా సంపన్నులకు, పేదలకు మధ్య వ్యత్యాసం పెరిగిందని, ధరలు అమాంతం పెరిగిపోగా, నిరుద్యోగం రికార్డు స్థాయికి చేరిందని కార్మిక సంఘాలు విమర్శించాయి. ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘిస్తూ నిందితులపై బుల్డోజర్లు నడిపిస్తోందని దుయ్యబట్టాయి. దేశ భవిష్యత్‌ను మరోసారి అంధకారంలోకి నెట్టే ప్రయత్నమే 'అగ్నిపథ్' అని వ్యాఖ్యానించాయి. ఈ పథకం వల్ల యువత భవిష్యత్ అనిశ్చితిలో పడుతుందని పేర్కొన్నాయి. తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ సరిహద్దులను కాపాడుతున్న వారికి పింఛన్, సామాజిక భద్రతను కల్పించలేని

- మిగతా 2 లో

ఎలక్ట్రానిక్స్ హబ్‌గా రాష్ట్రం

- తిరుపతి ఈఎంసీలో మూడు గ్లోబల్ కంపెనీల యూనిట్లు
- టీసీఎల్, ఫాక్స్‌లింక్, డిక్సన్ టెక్నాలజీస్ యూనిట్లు ప్రారంభించిన జగన్
- మరో రెండు యూనిట్లకు భూమి పూజ
- ఇంగలూరులో అడిడాస్ షూ తయారీ కంపెనీ అపాచీకి శంకుస్థాపన
- ఎంఓయూలు కుదుర్చుకున్న ఏపీఈఐటీఏ

విశాలాంధ్ర-తిరుపతి: ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి ఆంధ్రప్రదేశ్ కీలక కేంద్రం అవుతోంది. అనేక ప్రపంచస్థాయి కంపెనీలు రాష్ట్రంలో కంపెనీలు ఏర్పాటు చేస్తున్నాయి. తిరుపతి సమీపంలోని ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిష్ఠాత్మక కంపెనీలకు చెందిన 3 యూనిట్లను గురువారం ఒక్కరోజే ప్రారంభించారు. అడిడాస్ షూస్ తయారు చేస్తున్న అపాచీ కంపెనీ యూనిట్ సహా మరో రెండు ఎలక్ట్రానిక్స్ యూనిట్లకు సీఎం జగన్ భూమిపూజ చేశారు. ఈ పరిశ్రమల పెట్టుబడుల విలువ రూ.4వేల కోట్లుకాగా..20వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. వకుళమాత దేవాలయం ప్రారంభించిన తర్వాత సీఎం జగన్ శ్రీకాళహస్తి సమీపంలోని ఇనగలూరు వద్ద హిల్‌టాప్ ఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (అపాచీ) పరిశ్రమకు భూమి పూజచేశారు. రెండు దశల్లో రూ.800 కోట్లను ఈ కంపెనీ ఖర్చుచేయనుంది. 10వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇందులో 80శాతం ఉద్యోగాలు మహిళలకే. విఖ్యాత బ్రాండ్ అడిడాస్ షూలు, లెదర్‌జాకెట్స్, బెల్టులు తదితరవాటిని అపాచీ తయారుచేస్తోంది. 2023 సెప్టెంబరు నాటికి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. తర్వాత టీసీఎల్ అనుబంధ కంపెనీ పానెల్ ఆప్టో డిస్‌ప్లే టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ (పీఓటీపీఎల్)యూనిట్‌ను ప్రారంభించారు. ఈ యూనిట్‌కోసం రూ.1230 కోట్ల పెట్టుబడి పెట్టింది. 3200 మందికి ఉపాధి కల్పిస్తోంది. టీవీ ప్యానెళ్లు, మొబైల్ డిస్‌ప్లే ప్యానెళ్లను ఈ కంపెనీ తయారుచేస్తోంది. దీంతోపాటు ఫాక్స్‌లింక్ తయారీ యూనిట్‌ను కూడా సీఎం ప్రారంభించారు. హెచ్‌పీ ప్రింటర్లకు అవసరమైన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులను ఇక్కడ అసెంబ్లింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఐఫోన్లకు యూఎస్‌బీ చార్జర్లను తయారు చేస్తున్నారు. ఈ యూనిట్ కోసం కంపెనీ రూ.1050 కోట్ల పెట్టుబడి పెట్టింది. 2వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. సెల్‌ఫోన్లలో కెమెరా మాడ్యూల్స్‌ను తయారుచేసే సన్నీ అప్టోటెక్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీనికోసం రూ.280

- మిగతా 2 లో

విద్యా ప్రమాణాల్లో రాజీ పడొద్దు

ఎస్వీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

విద్యా ప్రమాణాల్లో రాజీపడకుండా విశ్వవిద్యాలయాలు ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు చేరవేయాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. 3 లో

పది రోజులు టిడ్కో సంబరాలు

పంపిణీకి సిద్ధంగా 30 వేల ఇళ్లు
డిసెంబరు నాటికి 2.62 లక్షల ఇళ్లు అందిస్తాం

అన్ని వసతులతో కూడిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. పది రోజులపాటు టిడ్కో సంబరాలు నిర్వహించి పూర్తయిన ఇళ్లను ప్రారంభించినున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమాన్ని గురువారం విజయనగరం జిల్లా నుంచే మొదలుపెట్టినట్టు పేర్కొన్నారు. 8 లో

జులై చివరిలో రండి
సోనియాగాంధీకి ఈడీ సూచన

2లో

ఇదీ లోకం!

భూ సమీకరణతో దోపిడీ

- ఈ పథకంలో రద్దైన డి పట్టాలు
- అధికారులు, దళారుల కుమ్మక్కు

విశాలాంధ్ర- పరవాడ (అనకాపల్లి జిల్లా): చట్టాలను అనకాపల్లి జిల్లా పరవాడ రెవెన్యూ అధికారులు తుంగలో తొక్కేస్తున్నారు. బలహీనవర్గాల గృహనిర్మాణం, సామాజిక గృహనిర్మాణాల పథకం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ సమీకరణ పథకం(ల్యాండ్ పూలింగ్ స్కీం-ఎల్‌పీఎస్)ను తమకు అనుకూలంగా మార్చుకుంటూ భారీ అక్రమాలకు పాల్పడుతున్నారు. పీవోటీ యాక్ట్ 2007 ప్రకారం అసైన్‌మెంట్ నిబంధనలను ఉల్లంఘించి క్రయవిక్రయాలు జరిపిన వారి నుంచి స్వాధీనం చేసుకున్న భూములను ల్యాండ్ పూలింగ్ స్కీంలో పెట్టి గజాల్లో కొల్లగొట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకు బ్రోకర్లను రంగంలోకి దింపుతున్నారు. విశాఖలో సిట్ ఏర్పాటుతో దేశపాత్రునిపాలెంలో మాజీ సైనికుల భూబాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ భూ బాగోతంలో కీలక సూత్రధారి రాష్ట్ర మంత్రి పేరుతో దళారీగా రెవెన్యూ అధికారులతో మంతనాలు జరుపుతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లో పరవాడ తహసీల్దార్

- మిగతా 2 లో

ప్రపంచ శాంతికి బ్రిక్స్ పాటుపడాలి: చైనా

బీజింగ్ : శాంతి, స్థిరమైన ప్రపంచ అభివృద్ధి సాధనకోసం సంఘీభావం, సమన్వయాన్ని విస్తరించాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ ప్రారంభోత్సవానికి వీడియో లింక్ ద్వారా ప్రసంగించిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం సవాళ్లను సంయుక్తంగా ఎదుర్కోవాలని సూచించారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా ఐదు ప్రధాన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలను కలిగిన బ్రిక్స్ 2006లో ప్రారంభమైనప్పటి నుండి 16 సంవత్సరాలలో అంతర్జాతీయంగా సానుకూల, స్థిరమైన, నిర్మాణాత్మక శక్తిగా బ్రిక్స్ ఎదిగిందన్నారు. మానవజాతి కోసం భాగస్వామ్య భవిష్యత్తుతో సమాజాన్ని నిర్మించడం లక్ష్యంగా బ్రిక్స్ దేశాలు సంకల్పించాయి. ఐక్యరాజ్యసమితి చార్టర్ యొక్క ప్రతిజ్ఞకు కట్టుబడి ఉండాలని, శాంతిని కాపాడే లక్ష్యాన్ని నెరవేర్చాలని ఆయన అన్ని దేశాలకు పిలుపునిచ్చారు. ఆధిపత్యం, గ్రూపు రాజకీయాలు, కుమ్ములాటలు శాంతి భద్రతలను తీసుకురావని అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం ప్రపంచంలోని అందరికీ మరో మేల్కొలుపుగా పిలుపునిచ్చారు. అన్ని దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడానికి కట్టుబడి ఉండాలన్నారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా దేశాల మధ్య విభేదాలు, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించాలన్నారు. పరస్పర గౌరవం, న్యాయం, విజయం, సహకారం ఆధారంగా కొత్త రకమైన అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరచాలని జిన్‌పింగ్ సూచించారు. ప్రజలకు మెరుగైన జీవితాలను అందించడంలో అభివృద్ధి కీలకం. సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కోసం బ్రిక్స్ 2030 ఎజెండాను అమలు చేయాలన్నారు. పేదరికం నిర్మూలన, ప్రజారోగ్యం, విద్య, డిజిటల్ కనెక్టివిటీ, పారిశ్రామికీకరణ'కు జిన్‌పింగ్ ప్రాధాన్యత కల్పించాలన్నారు.

సైనిక జైలుకు అంగ్‌సాన్‌సూకి

నైపిడా : మైన్మార్ నేత అంగ్ సాన్ సూకీని (77) గృహ నిర్బంధం నుంచి సైనిక నిర్మిత జైలు కాంపౌండ్‌లోకి తరలించినట్లు మైన్మార్ జుంటా అధికార ప్రతినిధి తెలిపారు. క్రిమినల్ చట్టాల ప్రకారం అంగ్ సాన్ సూకీని రాజధాని నైపిడాలోని జైలులో ఏకాంత నిర్బంధంలో ఉంచామని జుంటా అధికారి జా మిన్ తున్ పేర్కొన్నారు. అయితే ఆమె తిరుగుబాటు చేసినప్పటి నుంచి నైపిడాలోని ఒక అజ్ఞాత ప్రదేశంలో తన కుక్కతో కలిసి గృహ నిర్బంధంలో ఉన్నారు. ప్రస్తుతం ఆమెను కోర్టులో విచారణకు హజరుపరచడం కోసం ఈ ప్రాంతం నుంచి తరలించారు. పైగా ఆమెకి 150 ఏళ్లకు పైనే శిక్ష విధించారు. అంతేకాదు సూకీ తరుపున న్యాయవాదులు మీడియాతో మాట్లాడకుండా నిషేధం విధించారు. జర్నలిస్టులు సైతం ఆమెతో మాట్లాడేందుకు వీల్లేదు. ఇంతకు ముందు కూడా ఆమె మైన్మార్‌లో అతిపెద్ద నగరమైన యాంగాన్‌లోని తన ఇంటిలోనే చాలాఏళ్లు గృహనిర్బంధంలో ఉన్నారు. ఆమె అవినీతి, మిలటరీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినందుకు, కోవిడ్-19 ప్రోటోకాల్, టెలికమ్యూనికేషన్స్ చట్టం ఉల్లంఘన తదితర ఆరోపణలతో ఆమెను దోషిగా నిర్ధారించారు. కోర్టు సూకీకి ఇప్పటివరకు 11 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ విధానం పరిష్కారం కాదు : పీసీఎమ్

మెక్సికో : కొలంబియన్, లాటిన్ అమెరికన్ ప్రజలకు ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ విధానం (డెమోక్రటిక్ క్యాపిటలిజం) పరిష్కారం కాదని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ మెక్సికో (పీసీఎమ్) పేర్కొంది. కొలంబియాలో సోషల్ డెమోక్రాట్ నేత గుస్తావో పెట్రో ఎన్నికల విజయంపై వ్యాఖ్యానిస్తూ "ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ విధానం" కొలంబియా, లాటిన్ అమెరికా ప్రజల సమస్యలకు పరిష్కారం కాదని

పీసీఎమ్ నొక్కి చెప్పింది. కొలంబియా అధ్యక్షుడిగా ఎన్నికైన గుస్తావో పెట్రో ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ విధానాల్ని సవరించడమే లక్ష్యంగా పేర్కొన్నారు. ఇంధన పరివర్తన, దోపిడీ లేని వ్యవసాయ సంస్కరణలు, సంక్షేమ చర్యలు తమ ప్రభుత్వ ప్రధాన ప్రతిపాదనలుగా పెట్రో పేర్కొన్నారు. శ్రామిక వర్గ దోపిడీ, గుత్తాధిపత్య సంపదను ప్రైవేట్ శక్తులు స్వాధీనం చేసుకోవడం, గ్రామీణ ప్రాంతాలలో భూ యజమానుల అధికారం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మైనింగ్‌లు లక్ష్యంగా పీసీఎమ్ ప్రకటన పేర్కొంది. పెట్రో విజయాన్ని చిలీ, మెక్సికోలోని బోరిక్, ఒబ్రాడోర్‌ల విజాయాలతో పీసీఎమ్ సరిపోల్చింది. బోరిక్, ఒబ్రదార్ ప్రభుత్వాల వలె "సామాజిక శాంతి"ని కాపాడుకోవడానికి అణచివేత విధానాల నియంత్రణకు వెనుకాడరని పీసీఎమ్ పేర్కొంది. ఈ ప్రకటన లాటిన్ అమెరికాలో పెట్టుబడిదారీ విధానం సృష్టించిన సామాజిక, ఆర్థిక సమస్యలను గుర్తుచేసింది. ఇందులో కార్మికవర్గ దోపిడీ, తీవ్ర పేదరికం ఉన్నాయి. 70 ఏళ్లలో "విప్లవాత్మక" జాతీయవాద ప్రభుత్వాలు, పాత, కొత్త సామాజిక ప్రజాస్వామ్యవాదులు, "21వ శతాబ్దపు సోషలిస్టులు" ఈ సమస్యలకు శాశ్వత ముగింపు ఇవ్వలేకపోయారు. కార్మికవర్గం, ప్రజాదరణ పొందిన వర్గాలకు పెట్టుబడిదారీ అనాగరికతకు వ్యతిరేకంగా వారి పోరాటాన్ని తీవ్రతరం చేయడమే ఏకైక పరిష్కారంగా పీసీఎమ్ పేర్కొంది.

కొత్త జిల్లాలకు నిధుల కొరత

(మొదటిపేజీ తరువాయి)

లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఉద్యోగ సంఘాలు వాపోతున్నాయి. కరోనా కాలంలో విధుల్లో ఉండి చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టలేదు.

సాంకేతిక శిక్షణలో ప్రభుత్వం విఫలం

కొత్త కలెక్టరేట్‌లు, ఆర్డీవో కార్యాలయాల సిబ్బందికి రెవెన్యూ అంశాలపై తర్ఫీదు, సాంకేతిక శిక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలున్నాయి. కేవలం కార్యాలయాల విభజనకే పరిమితమైంది. సిబ్బందికి ఎలాంటి నైపుణ్యం కల్పించలేదు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రీ-సర్వేలో రెవెన్యూ సిబ్బంది సాంకేతి సమస్యల్ని ఎదుర్కొంటున్నది. రీ-సర్వేపై సిబ్బందికి ఆన్‌లైన్లో శిక్షణ ఇవ్వడం వల్ల ఫలితం కన్పించడం లేదు. ఆన్‌లైన్‌కు బదులుగా ఆఫ్‌లైన్లో ఇవ్వాలని రెవెన్యూ అసోసియేషన్ డిమాండు చేస్తోంది. ప్రభుత్వం స్పందించి కొత్త కలెక్టర్/ఆర్డీవో కార్యాలయాలకు సరిపడా సిబ్బందిని, నిధులు కేటాయించి ఉద్యోగులపై పనిభారం తగ్గించాల్సిన అవసరముంది.

జిల్లాల విభజన వివాదాస్పదం

నూతన జిల్లాల విభజన వివాదాస్పదంగా మారింది. అవసరమైన చోట్ల కొత్త జిల్లాలు ఏర్పాటు చేయలేదు. ఆ జిల్లాలకు పెట్టిన పేర్లపై ప్రభుత్వం ఆగ్రహానికి గురైంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరు వివాదాస్పదమైంది. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరును కలిపి పెట్టడంపై అక్కడ హింసాత్మక ఘటనలు జరిగాయి. సాక్షాత్తూ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌తోపాటు మరో ఎమ్మెల్యే ఇంటిని ఆందోళనకారులు దహనం చేశారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, అంబేద్కర్ కోనసీమ జిల్లాను కొనసాగించాలని విపక్షాలు డిమాండు చేస్తున్నాయి. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతోనే ఇలాంటి పరిస్థితులు తలెత్తాయనే విమర్శలున్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా, బాధ్యులపై ప్రభుత్వం వేగవంతంగా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. కొత్త జిల్లాలకు అవసమైన మౌలిక సౌకర్యాలు, నిధులపై సీఎం జగన్ తక్షణమే రెవెన్యూ ఉన్నతాధికారులతో సమీక్షించి చర్యలు చేపట్టాలి.

భూ సమీకరణతో దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో ఆర్ఐగా పనిచేసిన వారే ఇప్పుడు అధికారి హోదాలో ఉండటంతో దళారీతనం సులువైంది.

దేశపాత్రునిపాలెం రెవెన్యూ సర్వేనెంబర్ 303/1లో 1.38 ఎకరాలు, 303/2లో 0.99సెంట్లు, 303/3లో 3.83 ఎకరాలు ముగ్గురు వ్యక్తులకు అప్పటి అనకాపల్లి తహసీల్దార్ అసైన్డ్ చేశారు. ఈ భూమిని క్రయ విక్రయాలు జరిపారన్న కారణంగా 2017లో అప్పటి పరవాడ తహసీల్దార్ పీఏవీఎస్ మల్లేశ్వరరావు పీవోటీ యాక్ట్-2007ప్రకారం రద్దు చేశారు. ఈ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయన బదిలీ అనంతరం ఖాళీగా పడివున్న ఈ ఖరీదైన భూమిపై దళారీలు కన్నేశారు. ఇప్పుడు అనుకూల రెవెన్యూ అధికారులు రావడం, ప్రభుత్వం సైతం గృహనిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ స్కీంను ప్రవేశపెట్టి జీవోలు విడుదల చేయడంతో ఈ భూమిని కొట్టేసేందుకు 'చెరిసగం' ప్రాతిపాదకన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జీవీఎంసీ పరిధి దేశపాత్రునిపాలెం రెవెన్యూలోని 5.20 ఎకరాల భూమిని కాజేసేందుకు సమాయత్తమయ్యారు. ఇందుకు రిజిస్ట్రేషన్ శాఖలోని లొసుగులను వాడేసుకుంటున్నారు. కేవలం 1000 రూపాయలు చెల్లించి రిజిస్ట్రేషన్ రద్దు చేసుకునేందుకు మంతనాలు జరుగుతున్నాయి. గతంలో డి పట్టా భూములు అమ్మిన వారు మరణించినందున...వాటిని కొనుగోలు చేసిన ఎం.కనకారావుపై రిజిస్ట్రేషన్‌లు రద్దు చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. రిజిస్ట్రేషన్ రద్దయితే పీఓటీ చట్టం నుంచి ఈ భూమిని మినహాయించి వారసులకు కేటాయించి అనంతరం ల్యాండ్ పూలింగ్ స్కీంలో 900 గజాల ప్లాట్‌ను సొంతం చేసుకోవాలన్నది కుట్రగా చెబుతున్నారు.

ప్రభుత్వానికి ఎప్పుడో స్వాధీనమైన ప్రభుత్వ భూములను తిరిగి ప్రజా అవసరాలకు వినియోగించి అందులో కొంతభాగాన్ని కొట్టేయ్యాలన్నది పక్కా ప్రణాళికగా చెబుతున్నారు. అంతటితో ఆగకుండా డి పట్టా భూములుగా చూపి మట్టిని తవ్వి పక్కా జిరాయితీ భూములుగా చదును చేసేందుకు గనుల అక్రమ రవాణాకు సైతం పాల్పడుతున్నారు. రెవెన్యూ అధికారులు దీనిని ప్రోత్సహిస్తున్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులే దళారీల అవతారమెత్తి బెదిరింపులకు దిగడంతో డి పట్టా భూములు కొనుగోలు చేసిన ఎం.కనకారావు అనకాపల్లి సివిల్ కోర్టును ఆశ్రయించాడు. తను గతంలో కొనుగోలు చేసిన భూమిని తనకు కేటాయించాలని ఆయన వాదిస్తున్నాడు. ఈ సమస్య కోర్టులో తేలేందుకు సంవత్సరాలు పడుతుంది. ఇది లేకుండా తమతో చేతులు కలిపితే సకాలంలో న్యాయం చేస్తామంటూ రెవెన్యూ అధికారులు ప్రలోభాలకు గురిచేస్తున్నారు.

'అగ్నిపథ్' వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వమిదని విమర్శించాయి. యువతకు అన్ని సామాజిక వర్గాల మద్దతు ఉందని, తాము వెన్నుదన్నుగా నిలుస్తామని ప్రకటన పేర్కొంది. 24న దేశవ్యాప్త ఆందోళన దినోత్సవంగా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపునకూ సంపూర్ణ మద్దతును తెలుపుతున్నామని కేంద్ర ట్రేడ్ యూనియన్లు, సమాఖ్యలు వెల్లడించాయి. ఈ పథకానికి వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై దేశవ్యాప్తంగా అన్ని స్థాయిల్లో జరిగే ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంసీ, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీతో పాటు స్వతంత్ర సమాఖ్యలు ప్రకటించాయి.

వరుసగా మూడోరోజు పరబ్ విచారణ

ముంబై: మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి అనిల్‌పరబ్...తనపై నమోదైన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి వరుసగా మూడో రోజు గురువారం ఇక్కడ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. దక్షిణ ముంబైలోని బల్లార్డ్ ఎస్టేట్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయానికి మధ్యాహ్నం 2.45 గంటలకు పరబ్ చేరుకున్నారు. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా దపోలి బీచ్ ప్రాంతంలో సాయి రిసార్ట్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘనకు సంబంధించి మనీలాండరింగ్ విచారణలో భాగంగా ఈడీ అధికారులు ఆయన్ను ప్రశ్నించారు.

బుధవారం కూడా పరాబ్‌ను ఈడీ ఆరు గంటలకు పైగా ప్రశ్నించింది. మంగళవారం 10 గంటలకు పైగా విచారణ చేసింది. పరబ్ (57) మహారాష్ట్ర శాసనమండలికి మూడు సార్లు ఎన్నికయ్యారు. రవాణా, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రిగా ఉన్నారు. పరబ్‌తో పాటు ఇతరులపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎమ్ఎల్ఎ) కింద తాజా కేసు నమోదు చేసిన తర్వాత ఈడీ గత మేలో ఆయన నివాసాల్లో సోదాలు నిర్వహించింది.

గ్రీస్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సు

ఏథెన్స్ : 31వ సామ్రాజ్యవాద వ్యతిరేక సమావేశం గ్రీస్‌లోని వోలోస్‌లో జరుగనుందని కమ్యూనిస్ట్ యూత్ ఆఫ్ గ్రీస్ (పీసీఎమ్) వెల్లడించింది. జులై 9న జరుగనున్న ఈ అంతర్జాతీయ రాజకీయ కార్యక్రమంలో గ్రీస్, టర్కీ, స్పెయిన్, మెక్సికో దేశాలకు చెందిన కమ్యూనిస్టు పార్టీల నేతలు పాల్గొంటారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ) ప్రధాన కార్యదర్శి డిమిత్రిస్ కౌట్సొంబస్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ స్పెయిన్ (పీసీటీఈ) ప్రధాన కార్యదర్శి ఆస్టర్ గార్సియా, టర్కీ కమ్యూనిస్ట్ పార్టీ (టీకేపీ) జనరల్ సెక్రటరీ కెమాల్ ఒకుయాన్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ మెక్సికో (పీసీఎమ్) మొదటి కార్యదర్శి పావెల్ బ్లాంకో కాబ్రేరా ప్రసంగిస్తారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీ నికోస్ అబాటిలోస్ కీలక ప్రసంగం చేస్తారు. "సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల ఉమ్మడి పోరాటం" అనే నినాదంతో ఈ సమావేశం జరుగనుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక శిబిరంలో ఐరోపా(ఆస్ట్రియా,స్పెయిన్, ఇటలీ, రష్యా, టర్కీ, నెదర్లాండ్స్, స్వీడన్,సెర్బియా) నుండి ఎనిమిది కమ్యూనిస్ట్ యూత్ సంస్థలు ఈ సదస్సులో పాల్గొంటాయి.

ఫిరాయింపుల నిరోధక చట్టానికి

సవరణలు అవశ్యం

న్యూఢిల్లీ : రాజకీయ నాయకులు తరచూ దుర్వినియోగించే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి సవరణలు చేసేందుకు సమయం ఆసన్నమైంది. మహారాష్ట్రలో రాజకీయ సంక్షోభం క్రమంలో ఈ చట్టం మరోమారు తెరపైకొచ్చింది. పార్టీ ఫిరాయింపుల వల్ల రాజకీయ అస్థిరత నెలకొనడంతో పాటు ప్రజాభిప్రాయానికి భంగం వాటిల్లుతోంది. నానాటికీ జఠిలమవుతున్న ఈ సమస్యను అరికట్టడానికి నిబంధనలను కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది. భారత్‌లాంటి దేశాల్లో ఫిరాయింపుల చట్టం అవసరం. ఇక్కడ ఎమ్మెల్యేలను సుదూర రాష్ట్రాల్లో క్యాంపులకు తరలించి వారు ప్రత్యర్థి పార్టీ వలలో చిక్కకుండా కాపాడుకోవాల్సి ఉంటుంది. పార్టీకి నిబద్ధతగా ఉన్నందుకు, నాయకత్వంపై నమ్మకంగా ఉన్నందుకు ఎమ్మెల్యేలకు తిప్పలు తప్పవు. ఫిరాయింపు నిరోధక చట్టంలోని పదవ షెడ్యూల్‌లోని నాల్గో పేరాలో అనేక అంశాలు అస్పష్టంగా ఉండటంతో అది పెద్దఎత్తున దుర్వినియోగమవుతోంది. చట్టంలోని లొసుగులన్నీ రాజకీయ నాయకులకు బాగా తెలుసు కాబట్టే హోల్‌సేల్‌గా ఫిరాయింపులు జరుగుతున్నాయి. అందుకే చట్టాన్ని కఠినతరం చేయాల్సిన అవసరం ఏర్పడింది. పదవ షెడ్యూల్ డ్రాఫ్టింగ్ సరిగ్గా జరగలేదని పరిశీలకులు ఎవరైనా చెప్పగలరు. ఇందులోని పేరా నాలుగే అందుకు మంచి ఉదాహరణ. పార్టీల విలీనం క్రమంలో శాసనసభ్యులపై అనర్హత వేటు మినహాయింపు చట్టం రూపకర్తల ఉద్దేశం. విలీనం పార్టీకి చెందిన శాసనసభ్యులు అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం కారణంగా తమపై అనర్హత వేటు పడటం వల్ల ఇబ్బంది పడకూడదని రూపకర్తలు భావించారు. నాల్గో పారాలో ఉండాల్సిన అంశాలలో 1) ఒరిజినల్ రాజకీయ పార్టీ మరొక పార్టీలో విలీనం కావచ్చు. 2) విలీనం జరగాలంటే సంబంధిత పార్టీకి చెందిన 2/3వ వంతు సభ్యులు అంగీకరించాలి. 3) అందరి అంగీకారం ఉంటేనే చట్టప్రకారం విలీనం జరుగుతుంది. అప్పుడే శాసనసభ్యులకు అనర్హత నిబంధన వర్తించదు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని నాల్గో పేరాను పరిశీలిస్తే ఏది స్పష్టంగా ఉండదు. అసలు ఈ పేరా అవసరమే లేదు. రాజకీయ పార్టీల విలీనం సమయంలో మినహాయింపు అవసరమని అనుకుంటే దానిని రెండవ పేరా 2లో సరళ భాషలో చేర్చవచ్చు. అస్పష్టమైన నాల్గో పేరాను సాధ్యమైనంత త్వరగా తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇటీవల గోవా అసెంబ్లీ కాంగ్రెస్ సభ్యుల్లో 2/3వ వంతు వేరొక పార్టీలోకి వెళ్లిపోగా ఒరిజినల్ పార్టీ విలీనంతో పనిలేదని, ఈ విలీనం జరిగినట్టేనని బాంబే హైకోర్టు గోవా ధర్మాసనం తీర్పునిచ్చింది. దీంతో పదవ షెడ్యూల్‌లోని నాల్గో పేరాను తప్పుగా అన్వయించుకున్నారని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ మధ్యకాలంలో అనేక రాష్ట్రాల్లో హోల్‌సేల్‌గా ఫిరాయింపులు జరిగాయి. అలాంటి సందర్భాల్లో శాసనసభ్యులు మాత్రమే పార్టీ ఫిరాయించారు. ప్రస్తుతం మహారాష్ట్రలో రాజకీయంగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ శివసేన సభ్యులకు సంబంధించి మ్యాజిక్ ఫిగర్ 37 కాగా శివసేన తిరుగుబాటు వర్గానికి 37 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంటే బీజేపీతో కలిసి ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని కూల్చేయవచ్చు. కానీ ఇక్కడ శివసేనపై అసంతృప్తిగా ఉన్నప్పటికీ ఆ పార్టీ నుంచి వేరుపడాలని తిరుగుబాటు వర్గం కోరుకోవడం లేదుగానీ 37 మందితో వేరొక వర్గంగా ఏర్పాటు అయి బీజేపీ ప్రభుత్వానికి మద్దతివ్వాలని భావిస్తోంది. ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు కోసం రాజకీయ పార్టీలో చీలిక వర్గం వేరొక పార్టీకి మద్దతివ్వడం ఫిరాయింపు చట్టానికి వ్యతిరేకం. అనర్హత నుంచి తప్పించుకోవాలంటే తిరుగుబాటు వర్గం బీజేపీలో చేరిపోవాలి.. శివసేన కూడా బీజేపీతో కలిస్తేనే చట్టబద్ధత లభిస్తుంది. లేనిపక్షంలో అనర్హతకు గురవుతారు. తమదే నిజమైన శివసేన అన్న తిరుగుబాటు వర్గ ప్రకటనపై ఎన్నికల గుర్తు (కేటాయింపు) ఆదేశాల్లోని 15వ పేరా ప్రకారం ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికి తిరుగుబాటు వర్గం దావా పరిగణనలోకి రాదు. ఈ ఎమ్మెల్యేలపై అనర్హత కోసం ఫిరాయింపు చట్టంలోని పదవ షెడ్యూల్‌లోని పేరా 4 కింద పౌరులు ఎవరైనా పిటిషన్ దాఖలు చేయొచ్చు.

ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని 1985లో రూపొందించారు. దీనికి సంబంధించి రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌ను సవరించారు. 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టానికి మరికొన్ని సవరణలు చేశారు. ఒక పార్టీ తరపున ఎన్నికైన శాసనసభ్యుడు ఆ పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడు ఈ చట్టం ప్రకారం ఆమె/అతనిపై అనర్హత వేటుకు ఆస్కారం ఉంటుంది. ఒక పార్టీ మొత్తం శాసనసభ్యుల్లో 2/3వ వంతు మంది మరో పార్టీలో చేరినా లేక స్వతంత్రంగా వేరొక పార్టీ పెట్టినా అనర్హత వేటు కుదరదు. ఆరంభంలో ఈ చట్టం బాగానే పనిచేసిందిగానీ , రాజకీయ బుర్రలకు పదును ఎక్కువై ఇది కాలక్రమేణ దుర్వినియోగమవుతూ వచ్చింది. రాజకీయ పార్టీలో 1/3 వంతు సభ్యులు చీలిక ద్వారా బయటకి వచ్చి స్వతంత్రంగా ఉంటే వారి సభ్యత్వం రద్దయ్యేది కాదు. ఇది దుర్వినియోగమవుతున్న తీరును గమనించిన పార్లమెంట్ దానిని తొలగించింది. అదే విధంగా 'విలీనం' మినహాయింపు ఉంది. పదవ షెడ్యూల్‌లోని నాల్గో పేరా కల్పించే ఈ మినహాయింపు ఇటీవల పెద్దఎత్తున దుర్వినియోగమవుతోంది. తమ పార్టీ వేరొక పార్టీతో విలీనం అయిందని, తనతో పాటు 2/3వ వంతు మంది ఆ పార్టీ సభ్యులు అయిపోయినట్లు అసలు పార్టీకి చెందిన శాసనసభ్యుడు చెబితేగనుక ఆయన సహా ఫిరాయింపుదారులు అనర్హత వేటు నుంచి తప్పించుకోగలరు. ఈ నిబంధన కింద లబ్ధి చేకూరాలంటే రెండు షరతులు వర్తిస్తాయి. అందులో మొదటిది, అసలు పార్టీ వేరొక పార్టీతో విలీనం కావాలి, రెండవది 2/3వ వంతు శాసనసభ్యులు ఈ విలీనానికి అంగీకరించాలి. ఈ రెండూ జరిగితే సంబంధిత ఫిరాయింపుదారులకు అనర్హత వర్తించదు. ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఒకటి ఉంది. పార్టీ విలీనం అయినాగానీ అందుకు 2/3 వ వంతు మంది సభ్యులు అంగీకరించకపోతే చట్టప్రకారం ఆ విలీనం జరిగినట్లు పరిగణించరు. ఫలితంగా ఫిరాయింపు నేతలపై అనర్హత వేటు పడుతుంది. కేవలం శాసనసభ్యులు పార్టీ ఫిరాయించి.. అసలు పార్టీ వేరొక పార్టీలో విలీనం కాకపోయినా అనర్హత తప్పదు.

కంకిపాడు క్యాసినోపై చర్యలు చేపట్టాలి

డీజీపీకి వర్ల రామయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : గుడివాడ తరహాలో ఎన్టీఆర్ జిల్లాలోని కంకిపాడులో సైతం అక్రమ క్యాసినో నిర్వహించేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండు చేశారు. ఈ మేరకు డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి గురువారం లేఖ రాశారు. వైసీపీ నేతల మద్దతుతో రాష్ట్రంలో కొంతమంది అక్రమంగా జూదం, క్యాసినో కల్చర్‌ను ప్రోత్సహిస్తున్నారు. గతంలో కొడాలి నాని గుడివాడలో నిర్వహించిన అక్రమ కాసినోపై అనేక ఫిర్యాదులు ఇచ్చాం. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గుడివాడ క్యాసినో నేరస్థులపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడం వల్లే కంకిపాడులో 2022 జూన్ 22న మరో క్యాసినో నిర్వహించేందుకు ప్రయత్నించారు. మెజెస్టిక్ ఫ్రైడ్ క్యాసినో.లిమిటెడ్ పేరుతో నిర్వాహకులు టాలీవుడ్, బాలీవుడ్ డ్యాన్స్‌లతో పాటు లైవ్ షో ఆటాపాటలతో,కాక్‌టెయిల్ డిన్నర్‌లతో ఆహ్వాన ప్రకటనలు చేశారు. ప్రసార మాధ్యమాల్లో, సోషల్ మీడియాలలో ప్రజల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో ఈవెంట్‌కు అనుమతి లేదని పోలీసులు కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అనుమతులు జారీ చేయడం అత్యంత శోచనీయం. గుడివాడ అక్రమ క్యాసినో నిర్వాహకులపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడం వల్లే అధికార వైసీపీ నేతలు ఒక వర్గం పోలీసు అధికారులతో కుమ్మక్కై ఇలాంటి క్యాసినోలు నిర్వహించేందుకు ధైర్యం చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. అందువల్ల ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు పోత్సాహించే పోలీసులపై తగు చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

వీడని రాజకీయ ప్రతిష్టంభన

(మొదటిపేజీ తరువాయి)

కూటమి నుంచి వైదొలిగేందుకు శివసేన సిద్ధంగా ఉందన్నారు. గువహటిలో ఉన్న ఎమ్మెల్యేలంతా ముంబైకి 24 గంటల్లో తిరిగి రావాలని సూచించారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలను ముఖ్యమంత్రి ఠాక్రే గౌరవిస్తారని, ముంబైకి తిరిగి వచ్చి ఆయనతో మాట్లాడాలన్నారు. ట్విట్టర్, వాట్సాప్‌లో లేఖలు రాయొద్దు అని సూచించారు. గురువారం ఉదయం ఠాక్రే నిర్వహించిన సమావేశానికి 13 మంది ఎమ్మెల్యేలు హాజరు కాగా తిరుగుబాటు క్యాంపులోని 20 మంది తిరిగి వచ్చేస్తామంటున్నారని సంజయ్ రౌత్ వెల్లడించారు.

ఉద్ధవ్‌పై నమ్మకం ఉంది : ఎన్సీపీ, కాంగ్రెస్

ఉద్ధవ్ ఠాక్రేకు ఎన్సీపీ, కాంగ్రెస్ మద్దతు తెలిపాయి. ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నా ఉద్ధవ్ వెన్నంటే ఉంటామని ఎన్సీపీ నేత జయంత్ పాటిల్ తెలిపారు. కాంగ్రెస్ కూడా ఉద్ధవ్‌పై విశ్వాసం వ్యక్తం చేసింది. శివసేన అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని పేర్కొంది. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ చేస్తున్న యత్నాలు ఫలించవని కాంగ్రెస్ నేత గొగోయ్ అన్నారు. దేశంలో అస్థిరతను బీజేపీ సృష్టిస్తుందనేందుకు తాజా పరిస్థితులను మరొక ఉదాహరణగా చెప్పవచ్చు అని ఆయనన్నారు.

షిండేపై వేటు ఆమోదయోగ్యమే : డిప్యూటీ స్పీకర్

శాసనసభలో శివసేన నేతగా ఏక్‌నాథ్ షిండేను తొలగించి అజయ్ చౌదరిని ఆయన స్థానంలో నియమించడాన్ని మహారాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్ ఆమోదించారు. తాజా పరిణామంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. అజయ్ చౌదరి నియామకం గురించి శివసేన నుంచి లేఖ అందింది. పదవి నుంచి ఏక్‌నాథ్ షిండేను తక్షణమే తొలగిస్తున్నట్లు అందులో పేర్కొంది. లేఖను సీఎం ఠాక్రే పంపారు. నేను ఆమోదించాను' అని అన్నారు. రెబల్ ఎమ్మెల్యేలు 35 మంది సంతకాలతో షిండే పంపిన లేఖపై ప్రశ్నకు 'ఇటువంటి పార్టీ వ్యవహారాల్లో స్వతంత్రులకు పాత్రలేదు. ఒక (శివసేన) ఎమ్మెల్యే నితిన్ దేశ్‌ముఖ్ (రెబల్) ఆ లేఖపై సంతకం చేయలేదని చెప్పారు. దానిని పరిశీలించి న్యాయ నిపుణుల సలహా తీసుకొని ఆపై నిర్ణయిస్తా' అని అన్నారు. తనకు ఎలాంటి అనారోగ్యం లేకపోయినా కొందరు బలవంతంగా సూరత్‌లోని ఆసుపత్రిలో చేర్పించి ఇంజెక్షన్లు ఇప్పించారని, గుండె పోటు రాలేదని దేశ్‌ముఖ్ బుధవారం వెల్లడించిన విషయం విదితమే.

ఎమ్మెల్యేల హక్కుల పరిరక్షణకే ..: షిండే తిరుగుబాటుపై సీఎంకు లేఖ

శివసేనకు చెందిన శాసనసభ్యుల హక్కులను పరిరక్షించేందుకే మంత్రి ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకున్నారని, రెండున్నరేళ్లుగా పడిన అవమానాలే ఆయనతో ఈ పని చేయించాయని సీఎం ఠాక్రేకు రెబల్ ఎమ్మెల్యే సంజయ్ శిర్సత్ లేఖ రాశారు. శివసేనకు నిజమైన ప్రత్యర్థులైన కాంగ్రెస్, ఎన్సీపీని నెత్తిన పెట్టుకొని పార్టీ ఎమ్మెల్యేలను సీఎం విస్మరించారని, అధికారంలో ఉన్నా తమను ఎన్నడూ సీఎం అధికారిక కార్యాలయం 'వర్షా'లోనికి అడుగు పెట్టనివ్వలేదని పేర్కొన్నారు. సెక్రటేరియట్ 'మంత్రాలయ'కు వెళ్లే ప్రసక్తే లేదని, సీఎం ఎన్నడూ అక్కడకు రాలేదన్నారు. ఎమ్మెల్యేలు తమ బాధలను చెప్పుకునే వేదికను షిండే కల్పించారన్నారు. కాగా, శివసేన ఎమ్మెల్యేల మనోభావాలు ఈ విధంగా ఉన్నాయంటూ ఈ లేఖను తన ట్విట్టర్ ఖాతాలో షిండే పోస్టు చేశారు.

అవిశ్వాసానికి అవకాశం

మహావికాస్ అగాధీ ప్రభుత్వం మైనారిటీలో పడింది. మెజారిటీ ఎమ్మెల్యేలు షిండే క్యాంపుకు చేరుకున్నారు. దీంతో మద్దతును ఉపసంహరించుకుంటూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ఆ వర్గానికి అవకాశం లేకపోలేదు. అదే జరిగితే ఉద్ధవ్ ప్రభుత్వానికి బలపరీక్ష తప్పదు అని రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ శ్రీహరి అన్నారు. సభలో పార్టీ నేతలుగా అనిల్ చౌదరి నియామకం, డిప్యూటీ స్పీకర్ ఆమోదం చకాచకా జరిగిపోవడం ఇదే పరిణామాన్ని సూచిస్తోందన్నారు. తిరుగుబాటు వర్గం వద్ద సరిపడ సంఖ్య ఉందని నిర్ధారణ అయితే బలపరీక్ష ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు.

కాగా, శివసేనకు 55 ఎమ్మెల్యేలు ఉండగా ఎన్సీపీకి 53, కాంగ్రెస్‌కు 44 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. 288 మంది సభ్యుల అసెంబ్లీ మెజారిటీ మార్కు 144. మరోవైపు బీజేపీకి 106 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజ్ ఠాక్రే నేతృత్వ ఎంఎన్ఎస్, స్వాభిమానీ పక్ష, సూరాజ్య పార్టీలకు చెందిన ఒక్కొక్కరితో పాటు ఆరుగురు స్వతంత్రులు మద్దతివ్వడంతో సంఖ్యా బలం 116కి పెరిగింది. తాజా పరిణామాల క్రమంలో శివసేన సంఖ్యాబలం తగ్గింది. దాదాపు 42 మంది రెబల్ క్యాంపునకు చేరినట్లు తెలుస్తోంది.

షిండే, ఉద్ధవ్‌కు మద్దతుగా థానేలో బ్యానర్లు

శివసేన రెండుగా చీలింది. కొందరు ఉద్ధవ్ వెంట ఉంటే మరికొందరు షిండేకు మద్దతు తెలుపుతున్నారు. ఇదే క్రమంలో ఇద్దరు నేతలకు మద్దతిస్తూ ఆయా వర్గాలు థానేతో పాటు కల్యాణ్, డోంబివిలిలో అనేక చోట్ల బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేశాయి.

జులై చివరిలో రండి

సోనియాగాంధీకి ఈడీ సూచన

న్యూఢిల్లీ : అనారోగ్యం కారణంగా విచారణకు రాలేనని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చెప్పడంతో ఆమె జులై చివరిలో వచ్చి తన వాంగ్మూలాన్ని రికార్డు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సూచించింది. ఇదే విషయాన్ని అధికారులు గురువారం తెలిపారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈనెల 23న ఆమెకు రెండవసారి సమన్లు జారీ అయ్యాయి. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చినాగానీ పూర్తి విశ్రాంతిని వైద్యులు సూచించిన క్రమంలో ప్రస్తుతం విచారణకు హాజరయ్యే పరిస్థితిలో లేనని ఈడీకి సోనియాగాంధీ తెలిపారు. విచారణను వాయిదా వేయాలి కోరారు. ఆమె విన్నపాన్ని దర్యాప్తు సంస్థ మన్నించింది. విచారణను జులై చివరివారానికి వాయిదా వేసింది. దీంతో కోలుకునేందుకు ఆమెకు నాలుగు వారాల సమయం ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్స్ హబ్‌గా రాష్ట్రం

(మొదటిపేజీ తరువాయి)

కోట్ల పెట్టుబడి పెట్టారు. 1200 మందికి ఉద్యోగాలు కల్పించారు. టెలివిజన్ సెట్లను తయారుచేసే డిక్సన్ టెక్నాలజీస్ యూనిట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.108 కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. దీనిద్వారా 850 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఫాక్స్ లింక్ఇండియా కొత్తగా నిర్మించనున్న మరో యూనిట్‌కు జగన్ శంకుస్థాపన చేశారు. రూ.300 కోట్ల పెట్టుబడితోఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. 1200 మందికి ఉద్యోగాలు రానున్నాయి. తిరుపతి ఈఎంసీ వేదికపై ముఖ్యమంత్రి సమక్షంలో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీతో స్మార్ట్‌డీవీ టెక్నాలజీస్ ఒప్పందం కుదుర్చుకుంది. హై ఎండ్ వీఏఎల్ఎస్ఐ డిజైన్ టెక్నాలజీలో దాదాపు 3వేల మందికి ఉద్యోగాలు కల్పించనుంది. రూ.100 కోట్ల పెట్టుబడి పెడుతోంది. ఇదే కంపెనీ హై ఎండ్ వీఏఎల్ఎస్ఐ డిజైన్ టెక్నాలజీ 10వేలమంది యువతకు శిక్షణ ఇవ్వనుంది. టీసీఎల్ కార్పొరేషన్‌కు చెందిన పీఓటీపీఎల్ ఎలక్ట్రానిక్స్ కూడా ఎంఓయూ కుదుర్చుకుంది. తమ వ్యాపార విస్తరణలో భాగంగా పంపిణీ వ్యవస్థను, అనుబంధ పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దేశీయంగా, అంతర్జాతీయంగా ఎలక్ట్రానిక్స్ రంగం అవసరాలను తీర్చేందుకు, రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా మార్చేందుకు జెట్‌వర్క్ టెక్నాలజీస్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నారు. బ్రహ్మాండంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న యూనికార్న్ కంపెనీల్లో జెట్‌వెర్క్ టెక్నాలజీస్ ఒకటి. ఐటీ సేవల ఎగుమతి కోసం టియర్ 2,3 నగరాల్లో రాష్ట్రవ్యాప్తంగా కార్యాలయాలు తెరిచేందుకు ఏపీఈఐటీఏతో టెక్‌బుల్స్ ఎంఓయూ కుదుర్చుకుంది. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన సందర్భంగా సీఎం జగన్ ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని, వాటికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కంపెనీలు రావడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

కేజీబీవీ టీచర్ల వేతనాలు పెంచండి

ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో, అమరావతి: రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లు, ప్రిన్సిపల్స్ వేతనాలు పెంచాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కోరినట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, ఎస్టీయూ నాయ కులు గాజుల రాజేశ్వరరావు, సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు, కేజీబీవీ, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు కె.రత్నమాలినీ దేవి, పి.నాగేశ్వరి, టి.శేషలత, సీహెచ్ అర్చన తెలిపారు. గురువారం విజయవాడ పటమట కార్యాలయంలో పీడీని కలిసి సీఆర్‌టీలకు పీజీటీలుగా పదోన్నతులు, ఐదు ప్రత్యేక సాధారణ సెలవులు, బదిలీలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. బదిలీలు త్వరలో చేపడతామని, సీఆర్‌టీలకు పీజీటీలుగా వెళ్ళడానికి ప్రాధాన్యత ఇస్తామని, మూడు నెలల్లోపు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీడీ హామీ ఇచ్చినట్లు కత్తి తెలిపారు.

విద్యా ప్రమాణాల్లో రాజీ పడొద్దు

- ఎస్వీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు

విశాలాంధ్ర - తిరుపతి ఎస్వీయూ: విద్యా ప్రమాణాల్లో రాజీపడకుండా విశ్వవిద్యాలయాలు ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు చేరవేయాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. జాతీయ నూతన విద్యావిధానం అమలుతో దేశం ప్రపంచానికే ఆదర్శం కానున్నదని చెప్పారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం 58, 59, 60, 61, 62 సంయుక్త స్నాతకోత్సవాన్ని గురువారం వర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కులపతి హోదాలో వర్చువల్ పద్ధతిలో హాజరైన గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రముఖ ఫిలాంత్రఫిస్ట్ డాక్టర్ చంద్రభాను శత్పతి (ఒరిస్సా), ప్రసిద్ధ శతావధాని నరాల రామారెడ్డి (ప్రొద్దుటూరు), గొప్ప మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామ సుబ్బారెడ్డి (విజయవాడ) లకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. 340 మంది విద్యార్థులకు బంగారు పథకాలు అందజేశారు. స్నాతకోత్సవంలో భాగంగా 2015 నుంచి 2019 వరకు యూజి, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డిలు పూర్తి చేసిన 26,052 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. అనంతరం నూతన జాతీయ విద్యావిధానం-2020 డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చైర్మన్ కె. కస్తూరి రంగన్ మాట్లాడుతూ జ్ఞానాన్ని మరింతగా విస్తృతం చేసుకోవాలని యువతకు సూచించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి వర్సిటీ ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రా రెడ్డి, ఎస్వీయూ రెక్టార్ ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఓ. మహమ్మద్ హుస్సేన్, పరీక్షల నియంత్రణాధికారి ఎం. దామ్లానాయక్, వివిధ కళాశాలల డీన్లు, ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు, అకడమిక్ సెనేట్ సభ్యులు, మీడియా కమిటీ కన్వీనర్ ఆచార్య బి. దేవప్రసాద్ రాజు, మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ పి.సి. వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మాటికీ విశాఖే రాజధాని: విజయసాయిరెడ్డి



విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఎవరు అవునన్నా కాదన్నా విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధాని కావడం ఖాయమని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. విశాఖలోని అనేక కార్యక్రమాల్లో ఆయన గురువారం పాల్గొన్నారు. చంద్రబాబు సహా రాజధాని విశాఖ కాకుండా ఎవ్వరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఏ అభ్యర్థికి మద్దతు ఇస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ పార్టీ అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. దేశంలో అణగారిన వెనుకబడిన కులాలు ఏమైనా ఉన్నాయి అంటే అది కేవలం ఎస్సీ, ఎస్టీలు మాత్రమేనన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల వారిని మిగిలిన కులాలతో సమానంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన ఏ కార్యక్రమమైనా వైసీపీ సమర్థిస్తుందని తెలిపారు. దేశంలో నదులు, కాలువలు ప్రజలకు ఉపయోగపడే ఏ భూమినైన అక్రమించుకునే హక్కు ఎవరికి లేదన్నారు. అయ్యన్నపాత్రుడు కాలువను ఆక్రమించుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తాత్కా లికంగా కోర్టు స్టే ఇచ్చి ఉండవచ్చునని అభిప్రాయ పడ్డారు. దీనిపై సంబంధిత అధికారులు పూర్తి వివరా లను పరిశీలించిన తరువాత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళనబాట

11 నుంచి జేఏసీ సమ్మె

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై మున్సిపల్ కార్మిక, ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) సమాయత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సంఘటిత పోరాటానికి సన్నద్ధం కావాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సత్వరమే సమస్యలు పరిష్కరించకుంటే సమరశీల పోరాటాలు నిర్వహించాలని, అవసరమైతే జులై 11 నుండి నిరవధిక సమ్మె చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్లు పి.సుబ్బారాయుడు, కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి ఆక్యూపేషనల్ హెల్త్ అలవెన్సు చెల్లింపులు నిలిపి వేయడం దుర్మార్గమన్నారు. ఆరోగ్యభత్యం బకాయిలు సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు జీతం రూ.15వేలతో పాటు ఆరోగ్య బీమా రూ.6వేలు కలిపి మొత్తం రూ.21వేలు చెల్లించాలన్నారు. ఇంజినీరింగ్ విభాగంలోని 28 కేటగిరీల కార్మికులకు నైపుణ్యానికి తగిన విధంగా జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తున్నదన్నారు. మూడేళ్ల సీనియారిటీ ఆధారంగా స్కిల్డ్, సెమీస్కిల్డ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమానపనికి సమాన వేతనం చెల్లిస్తామని సీఎం జగన్ స్వయానా శాసనసభలోనే ప్రకటించారని, ఇప్పటికీ దానిని అమలు చేయలేదని ఆరోపించారు. ఒప్పంద కార్మికులకు నెలకు రూ.20వేల జీతం, కరువు భత్యం చెల్లించాలని అశితోశ్‌మిశ్రా కమిషన్ సిఫార్స్ చేసిందనీ, ఆ సిఫార్సులు సైతం అమలుకు నోచుకోలేదన్నారు. ప్రజారోగ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ఉపేక్షించడం ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. జేఏసీ రాష్ట్ర నాయకులు ఆసుల రంగనాయకులు, ఇ మధుబాబు, ఎస్.శంకరరావు, జి.ప్రసాద్, జి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఉప ఎన్నిక ప్రశాంతం

70 శాతం ఓటింగ్

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: ఆత్మకూరు అసెంబ్లీ నియోజక వర్గ ఉప ఎన్నికకు సంబంధించి నియోజక వర్గ పరిధిలోని 279 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కేవీఎన్ చక్రధర్ బాబు తెలిపారు. గురువారం ఆత్మకూరు ఉపఎన్నిక సందర్భంగా నియోజక వర్గ పరిధిలోని మర్రిపాడు, ఆత్మకూరు, సంగం మండలాల్లో కలెక్టం విస్తృతంగా పర్యటించి పోలింగ్ కేంద్రాలను సందర్శించి, 17ఎ రిజిస్టర్స్‌ను, ఓటర్ స్లిప్‌లను, పోలింగ్ సరళిని పరిశీలించారు. ముఖ్యంగా కోవిడ్ ప్రోటోకాల్ అమలుకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత జిల్లా ఎన్నికల అధికారి చక్రధర్ బాబు, మర్రిపాడు మండలం డీసీపల్లిలో ఏర్పాటు చేసిన 42, 43 పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో 17ఎ రిజిస్టర్‌ను, ఓటర్ స్లిప్‌లను పరిశీలించి, పోలింగ్ సరళి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సంగం మండలం గాంధీ జన సంఘంలోని 220 నెంబరు పోలింగ్ కేంద్రాన్ని, 199 నుంచి 210 నెంబరు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళిని, పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. తదుపరి కరటంపాడులో ఏర్పాటు చేసిన 98, 99 నెంబరు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమ వర్మ, జిల్లా ఎస్పీ విజయ రావులతో కలసి పరిశీలించారు. నియోజక వర్గ పరిధిలోని 279 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు చక్రధర్‌బాబు తెలిపారు. నియోజక వర్గ పరిధిలోని అన్నీ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదని, జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు మొత్తం 140 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ లైవ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సూక్ష్మ పరిశీలకులను కూడా నియమించామన్నారు. పోలింగ్ శాతాన్ని పెంచేలా అన్నీ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు హక్కు వినియోగంపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, కళాజాతాల ద్వారా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఓటర్లందరికి ఓటరు స్లిప్స్ పంపిణీ చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కోవిడ్ ప్రొటోకాల్ కచ్చితంగా అమలు జరిగేలా వైద్య బృందాలను నియమించి థర్మల్ స్క్రీనింగ్, శానిటైజ్ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అలాగే పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, వికలాంగులకు ర్యాంపులు మొదలైన మౌలిక సదుపాయాల ఏర్పాటు చేశామన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన దివ్యాంగులు, వృద్ధులకు సహాయార్థం రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో ట్రై సైకిల్స్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. 26న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు కూడా పూర్తి చేసినట్లు చక్రధర్‌బాబు తెలిపారు.

మీ ఇళ్లను కూలిస్తే ఊరుకుంటారా ?

అధికారులపై అచ్చెన్నాయుడు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ చేసే దాడుల్లో అధికారులు భాగస్వాములై నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు హెచ్చరించారు. గురువారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ అధికారులు రాజకీయాల కతీతంగా రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. జగన్ రెడ్డికి అయ్యన్న కుటుంబ చరిత్ర తెలుసా? వారి తాత, తండ్రి సొంత భూములను ప్రభుత్వాలకు దానం చేసి, అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని అనుమతులు తీసుకుని, నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకున్న బలహీన వర్గానికి చెందిన అయ్యన్నపాత్రుడి కుటుంబంపై అమానుషంగా ప్రవర్తించారు. అర్ధరాత్ర వేళ ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఇంటి ప్రహరీని కూల్చడాన్ని ప్రజలందరూ గమనించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగాన్ని పక్కనపెట్టి.. జగన్ రెడ్డి తన అవినీతిని ప్రశ్నించిన వారందరిపై దాడులు చేసి.. ఇబ్బందులకు గురి చేసిన విధానాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారు. ఐపీఎస్ ఆఫీసర్ వీఎన్ మణికంఠ, ఆర్డీవో గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఎమ్మార్వో జయకు రాజ్యాంగంపై కనీస పరిజ్ఞానం ఉందా? నిబంధనలకు విరుద్ధంగా ఇంటిని నిర్మిస్తే... 15 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. వీరెవ్వరికీ నిబంధనలు తెలియవా? అర్ధరాత్రి, ఇంటిని కూల్చడానికి నిమిషం ముందు నోటీసు ఇవ్వడమేమిటి? మణికంఠకు చట్టాలు తెలుసా? 300ఏ ప్రకారం సూర్యాస్తమయం తర్వాత ఎలాంటి కూల్చివేతలు వద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఆ ఆదేశాలు అమలు చేసే బాధ్యత లేదా? ఆర్డీవో చెప్పారని.. తాను చేశానని మణికంఠ చెప్పడం సిగ్గుచేటు. నువ్వు ఐపీఎస్ చదువుకోలేదా? ఆర్డీవో మౌఖిక ఆదేశాలు ఇస్తే.. లిఖిత పూర్వక ఆదేశాలు అడగాల్సిన బాధ్యత లేదా? మీ సతీమణి కూడా డీసీపీగా పనిచేస్తున్నారు. మీ ఇళ్లను అర్ధరాత్రి వేళ జేసీబీలతో కూలిస్తే మీకు బాధ ఉండదా? దీనిపై మణికంఠ తల్లిదండ్రులకు కూడా లేఖ రాస్తాం. ఈ పరిస్థితే వారికి వస్తే.. వారెంత బాధపడతారో లేఖలో వివరిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి.. వ్యతిరేక కార్యక్రమాల్లో భాగస్వాములైన అధికారులకు లేఖలు రాసి.. టీడీపీ అధికారంలోకి వచ్చాక వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోదీ విధానాలు కార్పొరేట్‌లకు వరం

497వ రోజుకు ఉక్కు దీక్షలు



విశాలాంధ్ర-కూర్మన్నపాలెం (విశాఖ): ప్రధాని నరేంద్ర మోదీ విధానాలు కార్పొరేట్ శక్తులకు వరంగా మారాయని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు గురువారం 497 రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఆర్.ఎం.హెచ్.పి, ఏ.సి.ఎస్, హెచ్.ఆర్ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్షల నుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జి.బోసుబాబు, ఎస్.రామారావు, డి.సి.హెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. పరిశ్రమలు, సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్ట బెడుతూ కార్మిక వర్గాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేయకపోగా, ఉన్న పరిశ్రమలను అమ్మేందుకు పావులు కదపడం దుర్మార్గమన్నారు. ఇకనైనా మోదీ తన విధానాలు మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కరోనా సమయంలో కూడా ప్రభుత్వ రంగమైన విశాఖ ఉక్కు కర్మాగారం వడ్డీలు కట్టిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. నేడు బ్యాంకులకు ప్రభుత్వ రంగ పరిశ్రమలు ద్వారా, మధ్యతరగతి ప్రజలు ద్వారా కట్టే వడ్డీలతోనే మన ఆర్థిక వ్యవస్థ ఉందన్నారు. ప్రభుత్వం వీటిని, ప్రజల ఆర్థిక స్థితిని దెబ్బ కొట్టే విధంగా చర్యలు చేపడుతోందని ఈ విధానాలను వ్యతిరేకించడం మనందరి కర్తవ్యం అని పిలుపునిచ్చారు. దీక్షా శిబిరంలో ప్రతినిధులు డి. డి ఎస్ వి ఎస్ శ్రీనివాస్, జి.జయ, వరప్రసాద్, ధన ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్ ఎ కె పి, శ్రీనివాస్ తదితరులతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి

11 నుంచి ప్రజానాట్యమండలి వర్క్‌షాప్

హైదరాబాద్: సెప్టెంబరులో జరిగే సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు, అక్టోబరులో విజయవాడలో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అరసం సంఘాలు రంగంలోకి దిగుతున్నాయి. నాటికలు, పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం గురువారం సంయుక్త సన్నాహక సభ జరిగింది. జులై 11 నుండి 13 వరకు హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించాలని సభ నిర్ణయించింది. సన్నాహకసభలో తెలంగాణ ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, తెలంగాణ అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రా నాయక్, చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

- బీఆర్క్ ప్రవేశ పరీక్షకు సర్వర్ల మొరాయింపు
- విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశవ్యాప్తంగా గురువారం నుంచి జేఈఈ - మెయిన్స్ తొలి విడత(సెషన్-1) ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు బీఆర్క్ ప్రవేశపరీక్ష ఉదయం, సాయంత్రం విడతలకు రాష్ట్రంలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో సర్వర్లు మొరాయించడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లే ముందు అక్కడ ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కేంద్రంలో విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులు చూపించి, ఆన్‌లైన్ లో వివరాలు నమోదు చేసుకుని జేఈఈ జారీచేసిన స్లిప్ తీసుకోవాలి. ఆ ప్రక్రియ పరీక్షకు గంటన్నర ముందు జరగాల్సి ఉండగా, గంటల కొద్దీ ఆలస్యమైంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆగిరిపల్లి ఎస్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో బీఆర్క్ పరీక్ష రెండో విడత.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థుల వివరాల నమోదు మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, సాయంత్రం 3 గంటలకు ప్రారంభించారు. దీంతో 3 నుంచి 6 గంటల వరకు జరగాల్సిన పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. దీనిపై విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. సర్వర్లు మొరాయించడంతోనే జాప్యమైందని కళాశాల సిబ్బంది దాటవేశారు.

29 వరకు బీటెక్ పరీక్షలు

గురువారం నుంచి ప్రారంభమైన బీటెక్ ప్రవేశపరీక్ష (పేపర్-1)లు ఈనెల 29 వరకు జరుగుతాయి. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు లక్షన్నర మంది పరీక్ష రాయనున్నారు. గత ఏడాది జూలైలో జరిగిన జేఈఈ మెయిన్స్‌కు తెలంగాణ నుంచి 62,091 మంది, ఏపీ నుంచి 73,263 మంది హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలతోపాటు ముఖ్యమైన పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్షలు జరుగుతాయి. మిగిలిన పరీక్షలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

టీడీపీ సమన్వయ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పార్టీ నేతల మధ్య నెలకొన్న విభేదాల పరిష్కారం కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్టీ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు తెలిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, టీడీ జనార్థన్, దామచర్ల సత్య కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో తొలి సమావేశం నిర్వహించి, రాష్ట్రవ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో నేతల మధ్య విబేధాలు, సమన్వయలోపం వంటి సమస్యలపై సమీక్షించింది.

పురుగుల మందు తాగి

తల్లి, ఇద్దరు కుమారుల ఆత్మహత్య

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): కుటుంబ మనస్పర్థల కారణంగా ఓ తల్లి, ఇద్దరు కుమారులు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన గురువారం కృష్ణలంక పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కృష్ణలంక గీతానగర్ కట్ట ఎస్‌టీఐ సమీపంలో నివాసం ఉండే చలమలశెట్టి గోపాలకృష్ణకు చందనలక్ష్మి (27)తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. గోపాలకృష్ణ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి మణికంఠ (9), జయహర్ష (7) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యా భర్తల మధ్య తరచూ మనస్పర్థలు రావడం, జీవితంలో సరదాగా గడిపిన రోజు లేదని తీవ్ర మనస్తాపానికి గురైన చందనలక్ష్మి బుధవారం అర్ధరాత్రి జ్యూస్‌లో పురుగుల మందు కలిపి తాను తాగి తన ఇద్దరు కుమారులకూ తాగించింది. గురువారం ఉదయం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన గోపాలకృష్ణ తలుపు కొట్టినా తెరవకపోవటంతో చుట్టుపక్కల వారి సహాయంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా భార్యా, ఇద్దరు కుమారులు విగత జీవులుగా పడి ఉన్నారు. దీంతో ముగ్గురిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాలుగేళ్ల క్రితం కూడా చందనలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడి ప్రాణహాని నుంచి బయట పడినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘అడ్డాకు’లకు అడ్డంకులెన్నో!

- పట్టించుకోని గిరిజన సహకార సంస్థ
- పాలకుల సీతకన్ను
- గిట్టుబాటు ధరలేక గిరిజనులు లబోదిబో

విశాలాంధ్ర-అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో ఈ సీజన్లో గిరిజనులు సేకరించే అడ్డాకులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో లబోదిబోమంటూ వాపోతున్నారు. వాస్తవానికి ఈ సీజన్లో ఏజెన్సీ ప్రాంతంలో అడ్డాకుల పంట విస్తరిస్తుంది. వాటిని సేకరించి ఆరబెట్టి, కట్టలుగా కట్టి తీసుకువచ్చి గిరిజనులు విక్రయిస్తుంటారు. అయితే ఇంతగా శ్రమించిన గిరిజనులకు దక్కే ప్రతిఫలం అంతంత మాత్రమే. కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించక, పాలకులు పట్టించుకోకపోగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ కష్టాలు ఎవరిదో చెప్పుకోవాలని, నష్టాలు ఎవరు భరిస్తారని మన్యప్రాంత గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు.

గతంలో అడ్డాకులను గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కొనుగోలు చేసేది. అయితే ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జీసీసీని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అయితే అటవీ ఉత్పత్తులు సేకరించే గిరిజనులకు అష్టకష్టాలు తప్పడం లేదు. గిరిజన అభివృద్ధి, ప్రగతి, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి కోసం ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థ నేడు అంటీముట్టనట్టు వ్యవహరిస్తోంది.

గతంలో చింతపండు, అడ్డాకులు, కొవెల జిగురు, జీడిపిక్కలు, తేనె ఇలా ప్రతి అటవీ వ్యవసాయ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేసేది. అయితే కాలక్రమేణా పాలకుల నిర్లక్ష్యం వల్ల జీసీసీ ఉన్నతాధికారుల నిర్వాకం వల్ల ఇటీవల కాలంలో అటవి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడం లేదు. కేవలం డీఆర్ డిపో నిర్వహణ, డీఆర్సీల పర్యవేక్షణకే పరిమితమవుతోందని ప్రజాసంఘాల నాయకులు, గిరిజనులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఈ సీజన్లో చింతపండు ఎన్ని టన్నులు కొనుగోలు చేసింది, అడ్డాకులు ఏవిధంగా కొనుగోలు చేస్తుంది, ఇతర అటవీ వ్యవసాయ ఉత్పత్తులను ఎన్ని టన్నులు కిలోలు కొనుగోలు చేసిందీ అధికారులు ఒక ప్రకటన విడుదల చేయాలని వివిధ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ఇది ఇలా ఉండగా ప్రస్తుత సీజన్లో వారపు సంతలకు విరివిగా పెద్ద ఎత్తున అడ్డాకుల తరలి వస్తున్నాయి. మైదాన ప్రాంత వ్యాపారులు గిరిజనులను మభ్య పెట్టి అతి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఓ పక్క జీసీసీ కొనుగోలు చేయక ఎన్నో మైళ్ల దూరం నడిచి సంతకు తీసుకు వచ్చినా అడ్డాకులకు గిట్టుబాటు ధర లభించక వీటిని తిరిగి గ్రామాలకు తీసుకు వెళ్ల లేక బ్రోకర్ల మాయలోపడి నష్టానికి అమ్ముకోవాల్సిన దుస్థితి గిరిజనులకు ఏర్పడింది. జీసీసీకి ఒక చైర్మన్, ఎండి డివిజన్ల వారీగా డీఎంలు, బ్రాంచ్‌ల వారీగా మేనేజర్లు ఉన్నప్పటికీ ఎందుకు బలోపేతం కావడం లేదని, లక్ష్యం ఎందుకు నెరవేరడం లేదని మన్యప్రాంత వాసులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన పురోగతికి వారి ఆర్థిక అభివృద్ధికి పనిచేయనప్పుడు జీసీసీ ఉండడం ఎందుకని గిరివాసులు మండిపడుతున్నారు. కేవలం పదవుల కోసం, అధికాం హోదా కోసమే జీసీసీ సంస్థలో ఉన్న వారు ప్రయత్నిస్తున్నారని ఏ విధంగానూ ఆదివాసీల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గిరిజన సహకార సంస్థలు ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై దృష్టిసారించి జీసీసీ ప్రక్షాళన చేయాలని ఆదివాసుల అభివృద్ధికి సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని మన్యం వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో మైదాన ప్రాంత వ్యాపారుల మోసానికి అమాయక గిరిజనులు బలి కాకతప్పదని, వారి కష్టానికి ఎప్పటికీ ప్రతిఫలం దక్కదని గిరిజనులు వాపోతున్నారు.

సంపాదకీయం

మహారాష్ట్రలో బీజేపీ ఆడిస్తున్న నాటకం

మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం సంక్షోభంలో పడిపోయిన తరవాత అసలు శివసేన అస్తిత్వానికే ముప్పు వస్తుందేమోనన్న అనుమానాలు వస్తున్నాయి. ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శాసనసభ్యులు ముఖ్యమంత్రి మీద తిరుగుబాటు చేసి మొదట సూరత్‌లో స్వల్పకాలం, ప్రస్తుతం గౌహతీలో విడిది చేస్తున్నారు. 288 మంది ఉన్న శాసనసభలో శివసేనకు 56 మంది ఉండేవారు. తిరుగుబాటు వర్గం నాయకుడు షిండే తనకు మద్దతు ఇస్తున్న వారు 40 మంది అంటున్నారు. అంటే శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే సమర్థకులు 15-16 మంది కంటే ఉండరు. ఈ రభస తరవాత ఠాక్రే రాజీనామా చేయలేదు కానీ ముఖ్యమంత్రి అధికార నివాసం నుంచి సొంతింటికి వెళ్లిపోయారు. అంటే ఇక తనకు పదవి ఉండదని ఆయన మానసికంగా నిర్ధారించుకున్నట్టున్నారు. అయితే పార్టీ మీద పట్టు కోసం ఇంకా పోరాడుతున్నట్టే కనిపిస్తున్నారు. తిరుగుబాటుదార్లు పైకి చెప్తున్న కారణం ఠాక్రే నాయకత్వంలో శివసేన హిందుత్వ సిద్ధాంతాన్ని వదిలేసిందని. కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్‌తో కలిసి ఫ్రంటు కట్టడం తమ పార్టీ స్వభావానికి అసహజమైందని షిండే వాదిస్తున్నారు. సంకీర్ణ ప్రభుత్వం వల్ల పార్టీగా శివ సేన, కార్యకర్తలు విపరీతంగా నష్టపోయారని షిండే అంటున్నారు. మరి ఇంతకాలం అధికారంలో ఉన్నప్పుడు ఆ సిద్ధాంతం, అసహజత ఎందుకు గుర్తుకు రాలేదో తెలియదు. 34 మంది తిరుగుబాటుదార్లు షిండే తమ వర్గా నికి నాయకుడని వాదిస్తూ గవర్నర్ భగత్ సింగ్ కోషియారీకి లేఖ పంపారు. గవర్నర్‌కు, ఠాక్రేకు కూడా కరోనా సోకింది. గవర్నర్ అయితే ఆసుపత్రిలో చేరారు. తన తండ్రి బాల్ ఠాక్రే నెలకొల్పిన శివసేనపై పట్టు సడలుతోందని గ్రహించిన ఠాక్రే నిన్న ఫేస్‌బుక్ లైవ్‌లో మాట్లాడుతూ తనను పార్టీ నాయకుడిగా వద్దని ఒక్క నాయకుడు చెప్పినా తప్పుకుంటానని చెప్పారు. ఇవాళ మరో అడుగు ముందుకేసి తిరుగుబాటుదార్లు 24 గంటల్లో సొంత గూటికి తిరిగి వస్తే కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకోవడానికి సిద్ధం అని శివసేన అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ ప్రకటించారు. సంకీర్ణ ప్రభుత్వం నుంచి శివసేన బయటికి రావడం ఒక్కటే అయితే అధినేత ఇచ్చిన 24 గంటల గడువు ఉపయోగించుకుని శివసేన అస్తిత్వానికి భంగం కలగకుండా చూసుకోవచ్చు. కానీ తిరుగుబాటుదార్లకు అసలు ఠాక్రే మీదే అసంతృప్తి ఉంది. ఠాక్రే శాసన సభ్యులకు కూడా సులభంగా దర్శనం ఇచ్చేవారు కాదు. గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. రెండున్నరేళ్ల నుంచి ముఖ్యమంత్రి ఇంట్లో ఎమ్మెల్యేలకే ప్రవేశించే అవకాశం లేకుండా పోయింది. ప్రధానమైన శాఖలన్నీ సంకీర్ణ భాగస్వామ్య పక్షాలకు కట్టబెట్టారని మరో ఫిర్యాదు. షిండే ఎమ్మెల్యేలను బలవంతంగా సూరత్ తరలించారన్న ఆరోపణా ఉంది. ఈ వ్యవహారంతో తమకేమీ సంబంధం లేదని బీజేపీ నాయకులు బుకాయిస్తున్నారు. సూరత్‌లోనూ, గౌహతిలోనూ షిండే బృందానికి స్వాగతం చెప్పింది బీజేపీ నేతలే. గౌహతీలో హోటళ్లలో వారికి విడిది ఏర్పాటు చేసింది బీజేపీ ముఖ్యమంత్రి హేమంత బిస్వ శర్మ అండదండలతోనే. "నా అనుకున్నవాళ్లే ఇలా చేయడం బాధేసింది" అన్న ఠాక్రే మాటలూ తిరుగుబాటుదార్లకు సంతృప్తి కలిగించలేదు.

శివసేనలో తిరుగుబాట్లు కొత్తేమీ కాదు. నిజానికి తిరుగుబాటు ఎదురు కావడం ఇదే మొదటిసారి కాదు. శివసేనలో మొట్టమొదటి తిరుగుబాటు 1991లో ఒ.బి.సి. నాయకుడు చగన్ భుజబల్ శరత్ పవార్‌తో చేతులు కలిపి కాంగ్రెస్‌లో కలిసినప్పుడు జరిగింది. మండల్ నివేదిక తరవాత వాస్తవ పరిస్థితిని అంగీకరించడానికి బాల్ ఠాక్రే నిరాకరించారు. దానికి అనుగుణంగా పార్టీని మార్చలేదు. ఆయనకు కులవ్యవస్థలో విశ్వాసం ఉండేది కాదు. ఠాక్రేకు బాగా పట్టు ఉండేది కనక తరవాతి ఎన్నికల్లో భుజబల్ ఓడిపోయారు. తరవాత 2005లో నారాయణ్ రాణే పార్టీ వదిలి వెళ్లడం శివసేనకు పెద్ద దెబ్బ. రాణే పదవులకోసం వెళ్లిపోలేదు. నిర్ణయాలు తీసుకోవడంలో తనకు పాత్రలేకుండా పోతోందన్నది ఆయన బాధ. కొద్ది నెలల తరవాత ఉద్ధవ్ నాయకత్వంలోకి వచ్చిన తరవాత రాజ్ ఠాక్రే వెళ్లిపోయి మహారాష్ట్ర నవ నిర్మాణ సేన ఏర్పాటు చేశారు. 2009 ఎన్నికల్లో ఆ పార్టీకి శాసనసభలో 13 సీట్లు దక్కాయి. ఆ తరవాత అదీ బలహీనపడిపోయింది.

శివసేన 56 ఏళ్ల చరిత్రలో బాల్ ఠాక్రే ఉండగానే రెండు మూడు సార్లు తిరుగుబాట్లు ఎదురైనాయి. శివసేన ఇప్పటి వరకు ఒక సంస్థగానో, ఒక సంఘంగానో వ్యవహరిస్తోంది తప్ప రాజకీయ స్వరూపం లేదు. బాల్ ఠాక్రే శివసేనను ఏర్పాటు చేసినప్పుడు మహారాష్ట్ర మహారాష్ట్రీయులదే అన్నది ప్రధాన లక్ష్యం. అది కూడా ఇతర రాష్ట్రాల వారు ఉద్యోగాలు ఎగరేసుకు పోతున్నారన్న భయంవల్లే. అలాంటి దశలో శివసేన స్థానికత అన్న అంశంపై నెగ్గుకు రాగలిగింది. కరడుగట్టిన హిందుత్వను భుజాన వేసుకున్న తరవాతే శివసేనకు రాజకీయాల్లో విజయాలు దక్కాయి. బాల్ ఠాక్రే ఉన్నప్పుడు ఎలాగోలా పరిష్కరించగలిగేవారు. తిరుగుబాట్లను ఎదుర్కోవడంలో ఉద్ధవ్ ఠాక్రేకు తగిన శక్తి లేదని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.

ఏ శిబిరంలో ఎంతమంది ఉన్నారో స్పష్టంగా చెప్పే అవకాశం లేదు. తిరుగుబాటుదార్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేయక పోవడం ఆయన తుదికంటా పోరాడాలనే ఆలోచిస్తున్నట్టు అనిపిస్తోంది. షిండే శిబిరంలోంచి తిరిగి వస్తున్న వారూ ఉన్నారు. అలాగే ఆయన శిబిరంలోకి వెళ్తున్న వారూ కనిపిస్తున్నారు. తాను తప్పుకుంటే శివసేన ప్రభుత్వమే ఉంటుందని హామీ ఇవ్వగలరా అన్నది ఠాక్రే ప్రశ్న. దానికి ఎటూ అవకాశం లేదు. షిండే వర్గం రాజీకి రాకపోతే బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. అప్పుడు ముఖ్యమంత్రి పదవి బీజేపీ నాయకుడికే దక్కుతుంది. షిండేకు మహా అయితే ఉపముఖ్యమంత్రి పదవి దక్కుతుందేమో. "మేం పోరాడేవాళ్లం. చివరకు సత్యమే జయిస్తుంది. మేం అధికారంకోసం పాకులాడేవాళ్లం కాదు. శరద్ పవార్, బాలా సాహెబ్ తొరాట్, అశోక్ చవాన్‌తో చర్చిస్తున్నాం. అవిశ్వాస తీర్మానం పెడ్తే మెజారిటీ నిరూపించుకుంటాం" అని సంజయ్ రౌత్ చెప్తున్న మాటల్లో మేకపోతు గాంభీర్యం మాత్రమే కనిపిస్తోంది. నిర్ణయాలు తీసుకోవడానికి శివసేనలో ఒక నిర్దిష్ట పద్ధతిగానీ, యంత్రాంగం గానీ లేవు. ఆ ఏర్పాటే ఉంటే రెండవ శ్రేణి, మూడవ శ్రేణి నాయకుల ఫిర్యాదులు వినే అవకాశం ఉండేది. వారికీ తమను సంప్రదిస్తున్నారన్న సంతృప్తి మిగిలేది. సర్వాధికారాలు అధినేత చేతుల్లోనే ఉంటాయి. ఆయనేమో దర్శన సులభుడు కాదు.

ప్రస్తుత సంక్షోభం శివసేన అంతర్గత రగడేనని బీజేపీ అంటోంది. కానీ ఉద్ధవ్ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని పూర్తి కాలం పదవిలో ఉండనివ్వకూడదన్న లక్ష్యంతోనే బీజేపీ పని చేస్తోంది. ఉద్ధవ్ మంత్రి వర్గంలోని మంత్రుల మీద అవినీతి ఆరోపణలు చేసి వేధించింది. తన చేతిలో ఉన్న కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దాడులు చేయించింది. జైళ్లకు పంపింది. కానీ ఎప్పటికైనా తమకు ఉపకరిస్తారనుకున్న షిండే లాంటి వారి మీద వచ్చిన ఆరోపణలను ఉపేక్షించింది. ఇప్పుడు ఆయనే బీజేపీ అధికార దాహానికి పావుగా ఉపయోగపడ్తున్నారు.

1952 ప్రత్యేకత

రా బావా ఏంటి ఈ రోజు నవ్వుతూ హుషారుగా వస్తున్నావు. పార్వతి మీ అన్నయ్య వచ్చాడు. మరో కాఫీ. ఏం లేదు బావా ఎండలు తగ్గి చల్లబడింది కదా అందుకని హుషారు అనుకోకు, నా ఆనందానికి కారణం ఉంది. అదేంటో చెప్పు బావా నేనూ సంతోషిస్తా. అదేంటి బావా నన్నడుగుతావు, నీవు నాకు చెప్పాల్సింది పోయి. నీ మనసు నాకెలా తెలుస్తుంది చెప్పు బావా? ఏముంది బావా నాకెందుకో విశాలాంధ్ర ఆఫీసు ముందు నుండి నడిచి వస్తుంటే 1952 గుర్తుకొచ్చింది. ఆ సంవత్సరానికి ఒక ప్రత్యేకత ఉంది కదా.

అవును. ఆ సంవత్సరంలో రెండు ప్రత్యేకతలున్నాయి. అదే సంవత్సరం మద్రాసు నుండి విడిపోవడానికి పోరాటం, పొట్టి శ్రీరాములు ప్రాణాలర్పించడం, అదే సంవత్సరం ఎన్నికలలో ఎర్ర పెట్టెలు పసుపు పెట్టెలలో ఓట్లు, అదే సంవత్సరం కష్టజీవుల కోసం పోరాడే కమ్యూనిస్టుపార్టీ విశాలాంధ్ర పేరుతో ఒక దినపత్రిక ఏర్పాటు చేసుకోవడం. అవును బావా విశాలాంధ్ర ఆఫీసు కనబడగానే అప్పుడే 70 సంవత్సరాలు నిండాయా అన్పించింది. అప్పట్లో నేను ప్రత్యేకంగా పేపరు కోసం 17 కి.మీ సైకిలుపై బందరు వెళ్లి మోదుమూడి శ్రీహరిరావుగారి షాపులో కొని తెచ్చేవాడిని. మాకు పోస్టులో

మరునాడు వస్తుంది. అయితే మరుసటి రోజు వరకు ఆగలేకపోయాం బావా. అవును బావా ఆ రోజుల్లో కె.వి.రమణారెడ్డిగారి వ్యాసం కోసం తహతహలాడేవాడినంటే నమ్ము. నాకు గుర్తులేదు గాని ప్రతి ఆదివారం అనుకుంటా ఆయన వ్యాసం ఉండేది. ప్రతిరోజు పోస్టులో వచ్చినా ఆ రోజు ఆగలేక సైకిల్‌పై వెళ్లి తెచ్చేవాడిని. పైగా ఆదివారం స్కూలుకు సెలవు కదా. అయితే అప్పటి నుండి పేపరు చదివే అలవాటు ఉందన్న మాట. అవును బావా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్లాసు నుండి రోడ్డు పైకి ఎ.ఐ.ఎస్.ఎఫ్ తరుపున వెళ్లినందుకు హెడ్‌మాష్టరు ఫేము బెత్తంతో కొట్టిన దెబ్బలకు వీపు వాచిపోయింది.

అది సరే బావా విశాలాంధ్ర పేపరు ఆనాటి నుండి ఈనాటి వరకు నియమ నిబద్ధతకు లోబడి పని చేస్తోంది. బడుగు వర్గాలకు బాసటగా నిలబడి పనిచేస్తోంది. ఈ రోజున 70వ వార్షికోత్సవం జరుపుకోవడం విశేషమే. అది సరే బావా అంత పేరున్న పేపరు ఎందుకు సర్క్యులేషనులో వెనుకబడి పోయింది. అందుకు కారణం మారుతున్న కాలం బావా. ఎప్పుడైతే వస్తు మార్పిడి యుగం పోయి కరెన్సీ ప్రవేశించిందో ఆనాటి నుండి సగటు మనిషి రూపాయికి బానిసగా మారి తన గమ్యం మరచిపోయాడు. అప్పటి నుండి పెట్టుబడిదారులు విసిరిన భ్రమల్లో పడి తన కోసం పోరాడిన పార్టీని, పేపరును మరచి దూరంగా జరిగాడు. సగటు మనిషిని పావుగా ఉపయోగించుకున్న పార్టీల పేపర్లు బలపడి పోతున్నాయి. అయినా కమ్యూనిస్టు పార్టీ విడిపోయిన తరవాత జనశక్తి, ప్రజాశక్తి పేపర్లు వచ్చాయి. ప్రస్తుతం ప్రజాశక్తి, విశాలాంధ్రల పోరాటం ఒకటే కదా. సిద్ధాంత విభేదాలతో విడిపోయి పేపర్లు పెట్టుకున్నా అన్ని పేపర్లు మూలం మర్చిపోకుండా కష్టజీవుల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి తల్లి లాంటిది విశాలాంధ్ర కదా. మద్దుకూరు చంద్రం నుండి యిప్పటి వరకు పనిచేసిన ఎడిటర్లు, సిబ్బంది అందరూ కమ్యూనిస్టు ఉద్యమం కోసమే తప్ప జీతం కోసం కాదు.

అవును బావా నాకు తెలిసిన ఒక సబ్ ఎడిటరు అంటాడు జీతం కోసం కాదు సర్ ఒక ధ్యేయంతో పని చేస్తున్నాం. జీతం కోసమే అయితే ఎప్పుడో ఎరవేసే క్యాపిటలిస్టుల పేపర్లలోకి మారిపోయే వాళ్లం అంటాడు బావా. అవును బావా పెరుగుతున్న ధరలతో చాలీచాలని జీతాలతో అంటిపెట్టుకుని పనిచేస్తున్నారంటే నిజంగా ఒక ధ్యేయంతో ఎప్పటికైనా బడుగుల కోసం ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురుతుందనే ఆశతోనే అనుకోవాలి బావా. అది సరే బావా సర్క్యులేషను తగ్గినా ఎన్నో కష్టనష్టాల కోర్చి పేపరు నడపడం సామాన్యమైన విషయం కాదు. ప్రకటనలు లేకుండా ఈ రోజుల్లో పేపరు నడపడం కష్టం. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నపుడు ప్రభుత్వాన్ని విమర్శించడం పేపరు నైతిక బాధ్యత. విమర్శిస్తే ప్రభుత్వ ప్రకటనలు రావు.

నిజమే బావా ప్రజాస్వామ్యం పేరుతో అప్రజాస్వామ్య పాలన చేస్తున్న పాలకులను విమర్శించని నాడు పేపరు నడపడమే అనవసరం కదా. అందుచేత ఎన్నో కష్టాలెదురైనా ఎవరి కోసం కమ్యూనిస్టులు పని చేస్తున్నారో ఆ కష్టజీవులే పేపరును ఆదుకుంటారనే నమ్మకంతో ముందుకు పోతోంది. విశాలాంధ్ర పెట్టిన రోజున కమ్యూనిస్టు పార్టీని తమ పార్టీగా భావించి కూలి పనిచేసి ఒకరోజు కూలి పార్టీ ఫండుగ యిచ్చిన రోజులున్నాయి. అలాగే ఆనాటి కుటుంబాల నుండి పల్లెల్లో ఇప్పుడూ విశాలాంధ్రకు చందాలిస్తున్నారు. యిప్పటికీ పార్టీని, పేపర్ని మరువని తరం మిగిలి ఉంది. వారి సహకారంతో ఎటువంటి ఢోకా లేకుండా విశాలాంధ్ర ముందుకు సాగుతుంది బావా.

వ్యాస రచయిత సెల్ 9885569394

పదిశాతం చేతుల్లో రాజ్యాధికారం

కృష్ణ ఝా

దేశ సంపదలో 70 శాతం పది శాతం సంపన్నుల చెంతనే ఉన్నది. అంతే కాదు ఈ పది శాతం చేతుల్లోనే రాజ్యాధికారం కూడా ఉందని ఆచరణలో రుజువవుతోంది. మన రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం మనది సార్వభౌమాధికారం, సోషలిస్టు, సెక్యులర్, ప్రజాస్వామ్య రిపబ్లిక్. పార్లమెంటరీ తరహా ప్రభుత్వం, ఫెడరల్ స్వభావం కలది. అయితే ఒకే కేంద్ర ప్రభుత్వ లక్షణాలు ఇందులో ఉన్నాయి. మన బహుళత్వ వ్యవస్థను పరిరక్షించుకునేందుకు రాజ్యాంగం పేర్కొన్న ఫెడరల్ స్ఫూర్తిని ధ్వంసం చేయటానికి కేంద్రీకృత వ్యవస్థను నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాస్తవాలను మరుగుపరిచేందుకు అవసరమైన సమాచారాన్ని తారుమారు చేస్తున్నారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశం. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అర్ధ శతాబ్దికి పైగా కొనసాగుతోంది. ఈ కాలంలో రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ వాటిని నిలువరించే ఉద్యమం కనీసం ఒక్కటి కూడా జరగలేదు. రాజ్యాంగంలో ప్రకటించిన అన్ని అంశాలను ధ్వంసం చేసే ప్రయత్నం జరుగుతూనే ఉంది. 70 శాతం సంపద అతి సంపన్నులైన పదిశాతం మంది చేతుల్లో ఉందన్న అంచనాను కొద్ది నెలల క్రితం ఆక్స్‌ఫామ్ ప్రకటించింది. తక్కిన ప్రజల జీవనం ఆకలిదప్పుల మధ్య అగమ్యగోచరంగా ఉన్నది.

ప్రస్తుతం ప్రతిరోజూ మన సార్వభౌమత్వం పది శాతం ప్రజల చేతుల్లో చిక్కుకుపోతోంది. మనల్ని మార్కెట్‌లో వస్తువుగా పెడుతున్నారు. సోషలిజంతో ఏ మాత్రం సంబంధం లేని అంశాలు మన విలువను నిర్ణయిస్తున్నాయి. పాలకులు ప్రతి సంవత్సరం లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని అనేక వాగ్దానాలు చేసినప్పటికీ ఆదాయం లేక చేసేందుకు పనులు లేక మురికివాడల్లో చాలీ చాలని నివాసాలలో జీవిస్తున్న వారిని వీధులపాలు చేసేందుకు బుల్డోజర్లు పెట్టి వారి ఇళ్లను కూల్చివేస్తున్నారు. ప్రతి నిత్యం ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. అగ్నిపథ్ పథకం పేరుతో అగ్ని జ్వాలలను రగిలించారు. ఉద్యోగాలు, పనులు లేక తీవ్ర నిరాశలో ఉన్న యువత సహనం నశించి, రైళ్లు, బస్సులకు నిప్పు పెట్టారు. రోడ్లు, కార్యాలయాలు ప్రత్యేకించి బీజేపీకి చెందిన కార్యాలయాలను దహనం చేశారు. ఏ ఉపాధి లేని యువత ఆగ్రహంతో ఏం చేయాలో అది చేసింది. ఎక్కువమంది యువత మంచి చదువు చదువుకున్నారు. అయినప్పటికీ

ప్రస్తుతం ప్రతిరోజూ మన సార్వభౌమత్వం పది శాతం ప్రజల చేతుల్లో చిక్కుకుపోతోంది. మనల్ని మార్కెట్‌లో వస్తువుగా పెడుతున్నారు. సోషలిజంతో ఏ మాత్రం సంబంధం లేని అంశాలు మన విలువను నిర్ణయిస్తున్నాయి. పాలకులు ప్రతి సంవత్సరం లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని అనేక వాగ్దానాలు చేసినప్పటికీ ఆదాయం లేక చేసేందుకు పనులు లేక మురికివాడల్లో చాలీ చాలని నివాసాలలో జీవిస్తున్న వారిని వీధులపాలు చేసేందుకు బుల్డోజర్లు పెట్టి వారి ఇళ్లను కూల్చివేస్తున్నారు. ప్రతి నిత్యం ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది.

చేసేందుకు ఏ పనులూ లేవు. చివరికి బంట్రోతుగా పని చేయటానికి కూడా చదువుకున్న యువత సిద్ధంగా ఉంది.

సైన్యంలో చేరేందుకు సంవత్సరాల తరబడి ఎంతో డబ్బు ఖర్చుచేసి శిక్షణ పొంది అవకాశం కోసం ఎదురు చూస్తున్న సమయంలో అగ్నిపథ్ పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం కింద తీసుకున్న వారికి ఉద్యోగాలు నాలుగేళ్లే ఉంటాయి. వేతనంతో కూడిన ఈ ఉద్యోగం గడువు ముగిసిన తరవాత ప్రభుత్వం ఏదో కొద్ది మొత్తాన్ని ఇంటికి పంపుతుంది. సైన్యంలో చేరేవాళ్లు 17-21 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి. ఆ తరవాత ఉద్యోగం నుండి వైదొలగాలి. యువత ఆగ్రహంతో ఉద్యమించగా, వయసును 23 ఏళ్ల వరకు పెంచారు. నిరుద్యోగుల కలలను ఈ పథకం వమ్ము చేసింది. యువత ఆందోళనను ఎదుర్కొనేందుకు హిందుత్వ మిలిటెంట్లు రంగంలోకి దిగారు. వీరు బుల్డోజర్లతో ప్రవేశించారు. అరాచకాలకు పాల్పడ్డారు. హిందువులు కాని వాళ్లందరిపైన అరాచక శక్తులని ముద్రవేస్తూ కల్లోలం సృష్టించటం "పవిత్ర కర్తవ్యం" అని భావిస్తారు. వీరికి పైనుండి వచ్చే మార్గదర్శకాలు కూడా అలాగే ఉంటాయి.

21 వ శతాబ్దం రెండవ దశకం మధ్యలో ఈ దేశంలో తిరిగి "క్రాంతి" ని పునరుద్ధరిస్తామని అవసరమైన చర్యలు ప్రారంభించారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత కర్త వినాయక్ దామోదర్ సావర్కర్ (1883-1966) క్రాంతిని ప్రవచించారు. అంతేకాదు మొత్తం రాజకీయాలను హిందుత్వ పరిధిలోకి తీసుకురావాలని, హిందుత్వ శక్తులన్నింటికి సైనిక శిక్షణ ఇవ్వాలని ఆయన రచించిన 'హిందుత్వ: హు ఈజ్ ఏ హిందూ' లో ఉపదేశించారు. హిందూ జాతీయ వాదానికి ఇదే మూలం. హిందూత్వ అనేది ఒక పదం కాదు. చరిత్ర మొత్తం ఇందులోనే భాగం కావాలి అని పేర్కొన్నారు. హిందుత్వ ఒక మతం లేదా ఆధ్యాత్మిక చరిత్ర కాదు, అది సంపూర్ణ చరిత్ర అంటూ పేర్కొన్నారు. దాన్నే ఇప్పుడు ఆదర్శంగా తీసుకొని దేశంలో బహుళత్వాన్ని ధ్వంసం చేసేందుకు పూనుకున్నారు. స్వార్థ ప్రయోజనం కోసం భిన్నత్వంలో ఏకత్వం వారసత్వాన్ని ధ్వంసం చేసేందుకు చరిత్రను వక్రీకరించేందుకు పూనుకున్నారు. మెజారిటీ వాదం పేరుతో నియం తృత్వాన్ని స్థాపించేందుకు కుట్ర పన్నారు. మెజారిటీ పరిపాలనను సాగించి ఇతర మతాలన్నిటిని నాశనం చేసేందుకు హిందూ జాతీయ నినాదాన్ని ఇచ్చారు. దేశంలో అధిక ధరలు, పెరుగుతున్న టోకు వాణిజ్యం, ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పడిపోవటం, నిజ వేతనాలు దిగజారటం, కుటుంబ వ్యయం అసాధారణంగా పెరగటం లాంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి బదులుగా దేశంలో నియంతృత్వ పోకడలు పెరిగిపోతున్నాయి.

అత్యుత్తమ నివాసయోగ్య నగరం వియన్నా

విశ్వ నగరాల్లో అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా ఆస్ట్రియా రాజధాని వియన్నా నిలిచింది. కోవిడ్ కల్లోలంతో మూతపడిన మ్యూజియమ్స్, రెస్టారెంట్ల కారణంగా 2021 సూచికలో 12వ స్థానంలో నిలిచిన వియన్నా ఈ ఏడాది తొలి స్థానానికి రావడం విశేషం. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 'ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ)' తాజాగా విడుదల చేసిన ప్రపంచ నివాసయోగ్య సూచిక 2022 ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా అధ్యయనం చేసిన 173 నగరాల్లో సంస్కృతులు, విద్యా వసతులు, వైద్య ఆరోగ్య వసతులు, రాజకీయ స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసరులు ఆధారంగా నిర్ణయించారు.

అత్యున్నత నివాస యోగ్యత కలిగిన నగరాల తొలి 10 స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా, 99.1/100), కోపెన్‌హెగన్ (డెన్మార్క్, 98), జూరిచ్ (స్విస్, 96.3), కల్గరీ (కెనడా, 96.3), వాన్కోవర్ (కెనడా, 96.1), జెనీవా (స్విస్, 95.9), ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ, 95.7), టొరంటో (కెనడా, 95.4), ఆమ్‌స్టర్‌డామ్ (నెదర్లాండ్, 95.3), ఓసా (జపాన్, 95), మెల్బర్న్ (ఆస్ట్రేలియా, 95.0/100) ఉన్నాయి. ఈ జాబితాలో 172వ స్థానంలో డమాస్కస్ (సిరియా, 30.7/ 100), 171వ స్థానంలో లాగోస్ (నైజీరియా, 32.2), తరవాత ట్రిపోలీ (లిబియా, 34.2), అల్జియర్స్ (అల్జీరియా, 37), కరాచీ (పాకిస్థాన్, 37.5), పోర్ట్ మోర్స్బీ (పపువా న్యూగినియా, 38.8), ఢాకా (బంగ్లాదేశ్, 39.2), హరారె (జింబాబ్వే, 40.9), డౌలా (కమెరూన్, 43.3), 163వ స్థానంలో టెహ్రానా (ఇరాన్, 44.0/100)లు నిలిచాయి. నివాస యోగ్యతపై ప్రతికూల ప్రభావాలకు కారణాలుగా యుద్ధాలు, సంఘర్షణలు, తీవ్రవాదం, విపత్తులు ఉన్నాయి.

కరోనాతో మారిన సూచీలు

కరోనా కారణంగా లండన్ (యూకె) 33వ స్థానానికి, లాస్ వేగాస్ (యూయస్) 18 నుండి 37వ స్థానానికి, వెల్లింగ్టన్ 4 నుంచి 50 వ స్థానానికి, ఆక్లాండ్ తొలి స్థానం నుంచి 34వ స్థానానికి, అడలైడ్ 2 నుంచి 30వ స్థానానికి, పెర్త్ 26 నుంచి 32కు, బ్రిస్బెన్ 17 నుంచి 27వ స్థానానికి పడిపోయాయి. కెనడా నగరాలు తొలి 10 స్థానాల్లో చోటు దక్కించుకోగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లోని నగరాల స్థాయి దిగిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్న వేళ కీవ్ నగరాన్ని అధ్యయనం నుంచి మినహాయించారు. అత్యున్నత నివాసయోగ్యత కలిగిన 10 స్థానాల్లో 6 స్థానాలు యూరోప్ నగరాలవే కావడం విశేషం. గత ఏడాదితో పోల్చితే ఫ్రాంక్‌ఫర్ట్ స్థానం 39 నుంచి 7, హాంబర్గ్ 47 నుంచి 16, డుసెల్డోర్ఫ్ 50 నుంచి 22వ స్థానానికి ఎదిగాయి. నివాస యోగ్యతలో భారత నగరాలు తొలి 10 స్థానాల్లో స్థానం దక్కించుకోకపోవడం కొంత విచారకరమే అయినా జాబితాలో చిట్టచివరి 10 స్థానాల్లో లేకపోవడం కొంత ఊరటను ఇస్తున్నది. కరోనా నిబంధనలతో పాటు నగరాల జీవన వ్యయాలు కూడా నివాస యోగ్యతలను ప్రభావితం చేశాయని నివేదిక స్పష్టం చేసింది.

డా : బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

ప్రాణాలు నిలపని పథకాలెందుకు?

బొల్లిముంత సాంబశివరావు

దేశంలోనూ, రాష్ట్రంలోనూ రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలేవీ ఆత్మహత్యలను ఆపలేకపోవటానికి కారణం ఏమిటి? అన్న లోతుల్లోకి వెళ్లి పరిశీలించాల్సి ఉంది.

1850-1940 మధ్య వలస పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో మరణాల రేటు చాలా ఎక్కువగా ఉన్నా వాటిలో ఆకలి మరణాలు, ఆత్మహత్యల కన్నా రైతుల ఆత్మహత్యలు చాలా తక్కువ. వలస పాలకుల నుండి అధికారాన్ని అందుకున్న భారత్ పాలనలో 1963-1970 మధ్యకాలంలో ఆత్మహత్యలపై ఉత్తర కర్నాటకలో అధ్యయనం జరిగింది. 1993లో ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ పరిమాణం, ఉత్పాదకతతో దాని సంబంధాన్ని సమీక్షించారు. భారతదేశంలో రైతుల ఆత్మహత్యల గురించి పత్రికల్లో నివేదికలు 1990 నుండి ప్రారంభమైంది. ముఖ్యంగా పాలగుమ్మి సాయినాథ్ ద్వారా 2000 దశకంలో ఈ సమస్య అంతర్జాతీయ దృష్టికి వెళ్ళింది.

భారతదేశంలో వరదలు, కరవు, అప్పులు, జన్యు మార్పిడి విత్తనాలు, తక్కువ దిగుబడులు, న్యాయమైన ధరలు లభించకపోవటం రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణాలుగా అధ్యయనాలు వెల్లడించాయి. జన్యుపరంగా మార్పు చెందిన ఖరీదైన విత్తన పంటలు, రైతుల ఆత్మహత్యల మధ్య సంబంధాన్ని అనేక సామాజిక అధ్యయనాలు వెల్లడించాయి. బీటీ విత్తనాలే రైతుల ఆత్మహత్యలకు కారణమని పేర్కొన్నాయి. ఈ విత్తనాల ధరలు సాధారణ విత్తనాల కంటే రెండు రెట్లు ఎక్కువని తెలియజేశాయి. దిగుబడులు తగ్గటం, వ్యవసాయ ఖర్చుల పెరుగుదల భారత రైతులకు భారంగా మారాయని వివరించాయి.

కేంద్ర ప్రభుత్వం, NCRB నివేదికల ప్రకారం 1993 నుండి 2018 వరకు ప్రభుత్వ వ్యవసాయ రాయితీలు ఎక్కువగా విత్తనాలు ఎరువుల ఉత్పత్తి దారులకు, డీలర్లకు అందాయే కాని రైతులకు అందలేదు. 2017లో న్యూదిల్లీ, చండీగఢ్ నగరాల్లో రైతులు లేని సంస్థలకు 35 వేల కోట్ల రుణాలు, సబ్సిడీలు ఇచ్చారు. అదే విధంగా మహారాష్ట్రలో

రైతుల సమస్యలు పరిష్కరించే ఉద్దేశం మోదీ ప్రభుత్వానికి లేదు. బహుళజాతి సంస్థల ప్రయోజనాలే మోదీ ప్రభుత్వానికి ముఖ్యం. వ్యవసాయాన్ని నష్టదాయకంగా మార్చి చిన్న, సన్న కారు రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కార్యక్రమం పెట్టుకుంది. ఈ ప్రమాదాన్ని గ్రహించి యావన్మంది రైతులు మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి.

60% ప్రభుత్వ రుణాలు, సబ్సిడీలు ముంబైలో నివసిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు కట్టబెట్టారు. ఫలితంగా ప్రభుత్వం, బ్యాంకులు, పెద్ద, చిన్న సంస్థల, రాజకీయ నాయకుల మధ్య డబ్బు చలామణి అవుతోంది. ఏ ఒక్కటీ రైతులకు చేరని ఫలితంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని నివేదికలు పేర్కొన్నాయి.

పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా రైతుల బలవన్మరణాలు తీవ్రమైనాయి. నేషనల్ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా 1995 నుండి 2013 వరకు 2,96,438 మంది భారత రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని వెల్లడించింది. మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయి. 2009 నుండి 2016 వరకు ఆ రాష్ట్రంలో 25,613 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కేరళ, పంజాబ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఇంకా అనేక రాష్ట్రాల్లో వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

రైతుల ఆత్మహత్యల నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయి. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ రాష్ట్రాలలో రైతుల ఆత్మహత్యలు అధికంగా ఉన్న 31 జిల్లాలను గుర్తించి, రైతుల కోసం ప్రత్యేక పునరావాస ప్యాకేజీ కేంద్రం ప్రారంభించింది. మహారాష్ట్ర లోని విదర్భ ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలపై పత్రికల్లో వార్తలు విస్తృతంగా రావటంతో, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో రైతు కుటుంబానికి రూ. 66 వేల నగదును అందించింది. 2006, జూన్ 30 నాటికి 7.12 బిలియన్ల వడ్డీ మాఫీ చేసింది. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమంగా భరించాయి. 36 మిలియన్ల మంది రైతులకు 653 బిలియన్ల రూపాయల రుణ ఉపశమన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2008లో అమలు చేసింది. కేరళ ప్రభుత్వం 2006 రుణ విముక్తి కమిషన్ చట్టానికి 2012లో సవరణ చేసి 2011 వరకు రుణాలతో కష్టాల్లో ఉన్న రైతులకు ఉపశమనం కల్పించనున్నట్లు చెప్పింది. ఇంకా అనేక పథకాలను రాష్ట్రాలు ప్రకటించాయి. ఈ పథకాలేవీ రైతుల మరణాలను ఆపలేకపోయాయి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేకపోయాయి.

రైతాంగం సమస్యలు పరిష్కారం కావాలంటే న్యాయమైన మద్దతు ధరలు, వాటికి చట్టబద్ధత, అవసరం మేరకు పంట రుణాలు, పంటల కొనుగోళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించటం, సబ్సిడీలు పెంచటం కావాలి. అప్పుడే రైతుల బలవంతపు మరణాలు ఆగుతాయి. రైతుల సమస్యలు పరిష్కరించే ఉద్దేశం మోదీ ప్రభుత్వానికి లేదు. బహుళజాతి సంస్థల ప్రయోజనాలే మోదీ ప్రభుత్వానికి ముఖ్యం. వ్యవసాయాన్ని నష్టదాయకంగా మార్చి చిన్న, సన్న కారు రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కార్యక్రమం పెట్టుకుంది. ఈ ప్రమాదాన్ని గ్రహించి యావన్మంది రైతులు మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి.

వ్యాస రచయిత సెల్ 9885983526

ఆధిపత్య పోరు

అన్నా డీఎంకే సమావేశం రసాభాస

ఓపీఎస్, ఈపీఎస్ వర్గాల ఘర్షణ

నీటి సీసాలతో ఓపీఎస్‌పై దాడి

చెన్నై: తమిళనాట అన్నా డీఎంకేలో అధిపత్య పోరు పతాకస్థాయికి చేరింది. ఓ.పన్నీరుసెల్వం, ఇ.పళనిస్వామి వర్గాల మధ్య యుద్ధవాతావరణం ఏర్పడింది. అన్నా డీఎంకే సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. పళనిస్వామి వర్గం ప్రవేశపెట్టిన 23 తీర్మానాలను ఎడప్పాడి కె.పళనిస్వామి వర్గం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఒక్కరి నాయకత్వంలోనే పార్టీ నడవాలని ఈపీఎస్ వర్గం వాదించింది. పార్టీలో ఎక్కువమంది ఈపీఎస్‌కు అండగా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంమీద అన్నా డీఎంకే సర్వసభ్యసమావేశం రసాభాస అయింది. పరస్పర దూషణలు, విమర్శలు, ప్రతివిమర్శలు, దాడులు, ప్రతిదాడులకు దిగారు. ఈ గందరగోళంతో ఓ.పన్నీరుసెల్వం వేదిక దిగి వెళ్లిపోయారు. ఓపీఎస్ పోడియం వద్ద నిలబడి ఉండగా ప్రత్యర్థులు ఖాళీ వాటర్ బాటిళ్లు విసిరారు. ఓపీఎస్, ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బందిని బాటిళ్లు తాకాయి. పన్నీరు సెల్వాన్ని కాపాడేందుకు భద్రతా సిబ్బంది వలయాకారంగా ఏర్పడి కారు వద్దకు తీసుకెళ్లారు. ఇక్కడ ఓపీఎస్ కారు చక్రాల గాలి తీసేశారు. దీంతో ఆయన వేరే కారులో వెళ్లిపోయారు. పన్నీరుసెల్వం, పళనిస్వామి వర్గాలు పరస్పర వ్యతిరేక నినాదాలు చేసుకున్నారు. తమ నాయకులకు మద్దతుగా తిట్లదండకం అందుకున్నారు. ఓపీఎస్, ఈపీఎస్ సమావేశ మందిరంలోకి ప్రవేశించగానే...వారి మద్దతుదారులు తమ నాయకులకు అనుకూలంగా నినాదాలు చేశారు. మరోవైపు, అన్నా డీఎంకే పరిణామాలపై డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందిస్తూ ఏఐఏడీఎంకేలోని అంతర్గత పోరును ప్రస్తావించారు. ఎవరైతే తమ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలికారో..ఇప్పుడు వాళ్ల పార్టీకే ఆ గతి పడుతోందని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

అన్నా డీఎంకే సమావేశంలో ఈపీఎస్ వర్గం నాయకులు ఉత్సాహంగా కనిపించారు. ఈపీఎస్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. ఏకవ్యక్తి నాయకత్వంలోనే పార్టీ ముందుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాలను గమనించిన పార్టీ ఉప కార్యదర్శి వైద్యలింగం మైక్ అందుకొని..ఆగ్రహం వెలిబుచ్చారు. జనరల్ బాడీ సమావేశం నిబంధనలకు అనుగుణంగా జరగడం లేదని చెప్పారు. సమావేశం ఇలా జరిగితే తాను ఉండలేనని వేదిక దిగి వెళ్లడానికి సిద్ధమయ్యారు. అదేసమయంలో ఓపీఎస్ అనుచరులు పీహెచ్ మనోజ్ పాండియన్ లేచి పన్నీరుసెల్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. ఓపీఎస్ మద్దతుదారులంతా పోడియం సమీపంలో నిలబడి ఉన్నారు.

ఆ సమయంలోనే ఓపీఎస్‌పై నాటి సీసాలు పడ్డాయి. వేదికపైన ఉన్న జేసీడీ ప్రభాకర్ సహా ఓపీఎస్ మద్దతుదారులు తమ నాయకుడికి సంఘీభావంగా నినాదాలు చేశారు. అన్నా డీఎంకే సర్వసభ్య సమావేశమే నినాదాలు, డిమాండ్లతో ప్రారంభమైంది. ముందుగా నిర్ణయించుకున్న తీర్మానాలను అజెండాగా ప్రవేశపెట్టారు. సమావేశానికి తమిళమగం హుస్సేన్‌ను అధ్యక్షత వహించాల్సిందిగా పన్నీరుసెల్వం ప్రతిపాదించగా పళనిస్వామి బలపర్చారు. సర్వసభ్య సమావేశంలో ఓపీఎస్ ప్రవేశపెట్టిన అన్ని తీర్మానాలను తోసిపుచ్చుతున్నట్లు సీనియర్ నేత సీ వే షణ్ముగం ప్రకటించారు. ఏఐఏడీఎంకేకు ఏకనాయత్వం అవసరమని ఈపీఎస్‌కు అనుకూలంగా మాట్లాడారు. డిప్యూటీ సెక్రటరీ కేపీ మునుస్వామి మాట్లాడుతూ మొత్తం 23 ప్రతిపాదలను జనరల్ కౌన్సిల్ సభ్యులు తిరస్కరించారని చెప్పారు. ఏకవ్యక్తి నాయకత్వమే ఏకైక డిమాండ్ అని స్పష్టంచేశారు. పార్టీకి ఒక్కరే నాయకత్వం వహించాలన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదింపచేసుకున్నారు. మెజారిటీ సభ్యులు పళనిస్వామికి మద్దతుగా ఉన్నారని షణ్ముగం చెప్పారు.

ద్రౌపది ముర్మును ఏకగ్రీవం చేయండి

ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంఘం విన్నపం

న్యూఢిల్లీ: ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థిగా ద్రౌపది ముర్మును ఖరారు చేయడం చరిత్రాత్మకమని అఖిల భారతీయ వనవాసి కల్యాణ్ ఆశ్రం ప్రశంసించింది. ద్రౌపది ముర్మును ఏకగ్రీవంగా ఎన్నుకోవాల్సిందిగా అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేసింది. గిరిజనుల సర్వతోముఖాభివృద్ధి దిశగా నిబద్ధతను ప్రదర్శించాలని కోరింది. భారతీయ సంస్కృతిలో అంతర్భాగమైనప్పటికీ ఏళ్ల తరబడి గిరిజన సమాజం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. భారతదేశంలో 12 కోట్లమంది గిరిజనులు ఉన్నారని, ఎన్‌డీఏ అభ్యర్థిగా ముర్ము పేరు ప్రకటించడం సామాజిక మార్పు దిశగా ఓ ముందడుగని పేర్కొంది. రాష్ట్రపతిగా ఎన్నికైతే ఆమెకు గల అపార అనుభవం, విధాన నిర్ణయాల పట్ల అవగాహన, చిత్తశుద్ధి దేశానికి ఎంతో లబ్ధి చేకూరుస్తుందని అభిప్రాయపడింది. 75 ఏళ్ల సాతంత్ర్య ఉత్సవాలు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న వేళ రాష్ట్రపతి అభ్యర్థిగా సంతాలీ మహిళ పేరును బీజేపీ ఖరారు చేయడం చారిత్రక నిర్ణయమని ఆ ప్రకటన వ్యాఖ్యానించింది. యావత్ ఆదివాసీ సమాజానికి ఇది గర్వకారణమని పేర్కొంది.

మళ్లీ పెరిగిన కొత్త కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. బుధవారం 6.56 లక్షల మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 13,313 కొత్త కేసులు వచ్చాయి. ఇన్ని రోజులు 12 వేలకు దగ్గర్లో నమోదైన కేసులు తాజాగా పెరిగాయి. పాజిటివిటీ రేటు 2.03 శాతానికి చేరింది. ఒక్క కేరళలోనే నాలుగు వేల మందికి పైగా కరోనా బారినపడ్డారు. మహారాష్ట్రలో మూడు వేలకు పైగా కేసులు రాగా, దిల్లీలో ఆ సంఖ్య వెయ్యి దిగువకు చేరింది. ముంబైలో పాజిటివిటీ రేటు 20 శాతానికి చేరి ఆందోళన కలిగిస్తోంది. గురువారం కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఇప్పటివరకూ 4.33 కోట్ల మందికి మహమ్మారి సోకింది. ఇన్‌ఫెక్షన్లు విస్తరిస్తుండటంతో క్రియాశీల కేసులు 83,990కి పెరిగాయి. క్రియాశీల రేటు 0.19 శాతంగా ఉండగా.. రికవరీ రేటు 98.60 శాతానికి పడిపోయింది. బుధవారం 10,972 మంది కోలుకున్నారు. 24 గంటల వ్యవధిలో 38 మంది మృత్యుఒడికి చేరుకున్నారు. తాజాగా మరణాల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తోంది. ఇక బుధవారం 14.91 లక్షల మంది టీకా తీసుకోగా.. మొత్తంగా 196 కోట్లకు పైగా డోసులు పంపిణీ పూర్తిచేసినట్లు కేంద్రం తెలిపింది.

ప్రధానితో ద్రౌపదిముర్ము భేటీ

న్యూఢిల్లీ: ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోదీని గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కూడా ద్రౌపది కలిశారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా ఆమె శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర నేతలు దిల్లీకి చేరుకుంటున్నారు. కాగా, ద్రౌపది ముర్ముని రాష్ట్రపతి పదవికి ప్రతిపాదించడాన్ని భారత సమాజంలోని అన్ని వర్గాలు మెచ్చుకున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఆమె మన దేశానికి గొప్ప రాష్ట్రపతి అవుతారనే నమ్మకం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఇక రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థిగా బరిలోకి దిగిన యశ్వంత్ సిన్హా మాట్లాడుతూ.. రాష్ట్రపతి రేసులో ఉన్న ద్రౌపది ముర్ముపై తనకు ఎంతో గౌరవం ఉందని, అయితే పోటీ ఇద్దరు వ్యక్తుల మధ్య కాదని, వ్యతిరేక భావజాలాల మధ్య పోరు అని అన్నారు. గత ఏడాది మార్చిలో బీజేపీ నుంచి నుండి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో చేరిన సిన్హా ముర్ముకు శుభాకాంక్షలు తెలిపారు.

శివసేనలోనే ఉన్నాను

స్పష్టంచేసిన ఎంపీ కృపాల్ తుమానే

నాగపూర్ : తిరుగుబాటు గ్రూపులో చేరినట్టు తనపై వచ్చిన ఆరోపణలను శివసేన ఎంపీ కృపాల్ తుమానే ఖండించారు. ఆయన నాగపూర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తాను శివసేన పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేశారు. తాను శివసేన తిరుగుబాటు నేత ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని రెబల్స్ బృందంలో చేరనున్నట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని పేర్కొన్నారు. తనను ఎవరూ సంప్రదించలేదు, తాను ఎవరికి మద్దతు ఇవ్వలేదని తెలిపారు. అయినా తన గురించి అసత్యాలు ప్రచారం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మాత్రం శివసేనతోనే ఉన్నానని, ఉంటానని వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా శివసేన పార్టీకి చెందిన ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని చీలిక వర్గం ప్రస్తుతం బీజేపీ పాలిత అసోం రాజధాని గుహవాటిలోని ఒక హోటల్‌లో క్యాంపు పెట్టారు.

స్వతంత్ర ఎమ్మెల్యేలతో కలసి ఆ వర్గంలో 46 మంది ఎమ్మెల్యేలున్నట్టు ప్రచారం జరుగుతోంది. గురువారం ఉదయం మరో ముగ్గురు శివసేన ఎమ్మెల్యేలు ముంబై నుంచి గుహవాటికి బయలుదేరి వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో మహారాష్ట్రలోని మహావికాస్ అఘాడి ప్రభుత్వం సంక్షోభంలోకి పడడంతో సీఎం ఉద్ధవ్ థాక్రే బుధవారం రాత్రి తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసి సొంత నివాసానికి చేరుకోవడం గమనార్హం.

దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకోవాలి

- **ఎగుమతిదారులకు ప్రధాని మోదీ సూచన**
- **కొత్త వాణిజ్య భవనం-ఎన్‌ఐఆర్‌వైఏటీ పోర్టల్ ప్రారంభం**

న్యూఢిల్లీ : ఎగుమతులకు సంబంధించి దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకోవాలని, వాటిని సాధించేందుకు ప్రభుత్వానికీ మార్గాలను సూచించాలని ఎగుమతిదారులకు, పరిశ్రమ వర్గాలకు ప్రధాని మోదీ సూచించారు. ఆయన గురువారం వాణిజ్య భవనాన్ని దిల్లీలో ప్రారంభించారు. అభివృద్ధి చెందుతున్న దేశం స్థాయి నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారడంలో ఎగుమతుల పాత్ర కీలకమన్నారు. గత ఆర్థిక సంవత్సరం భారతీయ ఎగుమతులు మొత్తం విలువ రూ.50లక్షల కోట్లుగా తెలిపారు. 2021-22లో భారత్ సరకు రవాణా రూ.31లక్షల కోట్లను దాటిందని, పెట్టుకున్న లక్ష్యం రూ.30లక్షల కోట్లు అని చెప్పారు. గత విజయాల నేపథ్యంలోనే ఎగుమతి లక్ష్యాలను పెంచామని, వాటి సాధనకు రెట్టింపు కృషిచేస్తున్నామని చెప్పారు. సంయుక్త కృషితో సాధించలేనిది ఏమీ లేదని మోదీ నొక్కిచెప్పారు. స్వల్ప కాలానికే కాదు దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కొత్త వాణిజ్య భవనం వల్ల వర్తకం, వాణిజ్యం, లఘు, చిన్న, మధ్యస్థాయి పరిశ్రమ (ఎంఎస్‌ఎంఈ) రంగానికి చెందిన వారికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. జాతీయ ఎగుమతి-దిగుమతి వార్షిక రికార్డు-వాణిజ్య సమీక్ష (ఎన్‌ఐఆర్‌వైఏటీ) పోర్టల్‌నూ ఆయన ప్రారంభించారు. భారతీయ విదేశీ వర్తకానికి సంబంధించిన సమాచారం మొత్తం ఈ పోర్టల్‌తో ఒకే చోట అందుబాటులో ఉంటుందని అన్నారు. సులభతర వాణిజ్యంతో పాటు ఎగుమతులను ప్రభుత్వం పెంపొదిస్తోందని చెప్పారు. హస్తకళలు కొత్త విపణులకు చేరుతున్నాయని మోదీ అన్నారు. పత్తి, హ్యాండ్లూమ్ ఉత్పత్తుల ఎగుమతులు 55శాతం పెరిగినట్లు తెలిపారు. సీతాభోగ్ మిఠాయిని బెహ్రెయిన్‌కు; నాగాలాండ్ కింగ్ చిల్లీని లండన్‌కు, అసోంలోని బర్మనీస్ ద్రాక్షను దుబాయికి; చత్తీస్‌గఢ్ నుంచి గిరిజన మహువా ఉత్పత్తులను ఫ్రాన్స్‌కు, కార్గిల్ ఖుమానీని దుబాయికి ఎగుమతి చేస్తున్నట్లు దేశీయ ఉత్పత్తుల ఎగుమతులనుద్దేశించి అన్నారు. యూఏఈ, ఆస్ట్రేలియాతో గతేడాది జరిగిన వాణిజ్య ఒప్పందాలనూ ప్రస్తావించారు. ఇటీవల అభివృద్ధి చెందిన పోర్టళ్లు, మాధ్యమాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రతి శాఖకు మోదీ సూచించారు.

రాష్ట్రపతి ఎన్నికలకు

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ రెండోసారి దూరం

న్యూఢిల్లీ: ఈసారి రాష్ట్రపతి ఎన్నికల్లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ భాగం కావడంలేదు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఈ రాష్ట్రం పాల్గొనకపోవడం ఇది రెండవసారి. శాసనసభ రద్దు కారణంగా మొదటిసారి 1974లో గుజరాత్ అసెంబ్లీ రాష్ట్రపతి ఎన్నికలకు దూరమైంది. తదుపరి ఎన్నికలలో అసోం, నాగాల్యాండ్, జమ్మూకశ్మీర్ అసెంబ్లీలు కూడా రద్దు కారణంగా పాల్గొనలేకపోయాయి. ప్రస్తుత సందర్భంలో, 2019లో జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. జమ్మూకశ్మీర్ శాసనసభను ఇంకా ఏర్పాటు చేయలేదు. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి శాసనసభను ఏర్పాటు చేయాల్సి ఉన్నా వివిధ కారణాల వల్ల ఎన్నికలు ఇంకా నిర్వహించలేదు. 1974లో, గుజరాత్‌లో నవనిర్మాణ ఉద్యమం ఉధృతంగా సాగింది. ఇది చిమన్‌భాయ్ పటేల్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి దారితీసింది. రాష్ట్రపతి ఎన్నికలను వాయిదా వేయాలనే డిమాండ్‌ల నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 54... ఎలక్టోరల్ కాలేజీ సభ్యుల అర్హతలను చూపించే ఉద్దేశంతోనే పార్లమెంటు, శాసనసభల సభలను ప్రస్తావించిందని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఒక రాష్ట్రానికి చెందిన రద్దయిన శాసనసభలో ఎన్నుకోబడిన సభ్యులు ఇకపై పార్లమెంటు ఉభయ సభల సభ్యులు, రాష్ట్రాల శాసనసభ్యులతో కూడిన ఎలక్టోరల్ కళాశాలలో సభ్యులు కారు...అందువల్ల రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లు వేయడానికి అర్హులు కాదు' అని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. 1992లో, జమ్మూ కశ్మీర్ , నాగాలాండ్ శాసనసభలు రద్దు కావడంతో 10వ రాష్ట్రపతి ఎన్నికలలో భాగం కాలేదు. అప్పుడు శంకర్ దయాళ్ శర్మ రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 1992లో జమ్మూకశ్మీర్‌కు అధ్యక్ష ఎన్నికలలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఎందుకంటే తీవ్రవాదం కారణంగా 1991లో ఆ రాష్ట్రంలో లోక్‌సభకు కూడా ఎన్నికలు జరగలేదు. అయితే జులై 18న జరగనున్న రాష్ట్రపతి ఎన్నికలలో... కేంద్రపాలిత ప్రాంతం నుంచి ఐదుగురు లోక్‌సభ సభ్యులు - ఫరూక్ అబ్దుల్లా, హస్నైన్ మసూది, అక్బర్ లోన్, జుగల్ కిషోర్ శర్మ, జితేంద్ర సింగ్‌లు తమ ఓటు వేయడానికి అర్హులు. 1982లో జ్ఞాని జైల్ సింగ్ రాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు, అసెంబ్లీ రద్దు కావడంతో అసోం శాసనసభ్యులు ఓటు వేయలేకపోయారు.

వరదలతో అసోం అతలాకుతలం

పొంగిపొర్లుతున్న నదులు, వాగులు, వంకలు

218 రోడ్లు, 20 వంతెనలు

99,026 హెక్టార్లలో పంట నష్టం

గువహటి: అసోంలో వరద పరిస్థితి గురువారం భయంకరంగా మారింది. 54.5 లక్షల మంది నిరాశ్రయులవగా, తాజాగా 12మంది మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. మే నెల మధ్య నుంచి వరదల కారణంగా ఇప్పటి వరకూ 101 మంది మరణించారన్నారు. బ్రహ్మపుత్ర, బరాక్ నదులు దాని ఉపనదులతో ఉప్పొంగుతున్నాయి రాష్ట్రంలోని మొత్తం 32 జిల్లాల్లో విస్తారమైన భూములు ముంపునకు గురయ్యాయి. అయితే కొన్ని చోట్ల వరద నీరు తగ్గుముఖం పట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 276 బోట్ల సహాయంతో మొత్తం 3658 మందిని ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఇతర ఏజెన్సీలు తరలించినట్టు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. అసోంలోని 12 వరద ప్రభావిత జిల్లాల్లో 14,500 మందికి పైగా ప్రజలు ఎన్‌డీఆర్‌ఎఫ్ చేత రక్షించబడ్డారని ఒక అధికారి తెలిపారు. భారీగా వరదలు ఉన్న జిల్లాల్లో 70కి పైగా పడవలు, 400 మంది సిబ్బందిని మోహరించినట్లు అసిస్టెంట్ కమాండెంట్ సంతోష్ కుమార్ సింగ్ తెలిపారు. మంగళవారం నుంచి 207 మంది సిబ్బందితో ఇతర బెటాలియన్ల నుంచి అదనంగా ఎనిమిది బృందాలను సిల్చార్‌కు తరలించినట్లు ఆయన వివరించారు. కమ్రూప్, కమ్రూప్ రూరల్, బొంగైగావ్, బార్పేట, బజలి, హోజాయ్, నల్బరి, దరాంగ్, తముల్‌పూర్, నాగావ్, ఉడల్‌గురి, కాచర్‌లలో ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ ఆపరేషన్‌లను నిర్వహిస్తోందని సింగ్ చెప్పారు. బాధిత ప్రజలకు సహాయక సామగ్రిని పంపిణీ చేయడంలో జిల్లా పాలనా యంత్రాంగానికి సహాయం చేయడంలో కూడా ఈ దళం నిమగ్నమై ఉందని ఆయన వివరించారు. కేంద్ర జల కమిషన్ (సీడబ్ల్యూసీ) బులెటిన్ ప్రకారం, కోపిలి నది నాగావ్ జిల్లాలోని కంపూర్, శివసాగర్‌లోని దిసాంగ్ నది, నిమతిఘాట్ వద్ద బ్రహ్మపుత్ర, తేజ్‌పూర్, గోల్‌పరా, ధుబ్రి వద్ద, కరీంగంజ్‌లోని బరాక్ నది, కాచర్, హైలకండి జిల్లా, కుషియారా వద్ద ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తోంది. కరీంగంజ్ వద్ద బరాక్ లోయ జిల్లాలు కాచర్, హైలకండి, కరీంగంజ్ బరాక్, కుషియారా నదుల నీటి పెరుగుదలతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. సిల్చార్ పట్టణం నాలుగు రోజులుగా కట్ట తెగిపోవడంతో నీట మునిగింది. కాచర్ జిల్లాలోని 565 గ్రామాల్లో మొత్తం 2,32,002 మంది, కరీంగంజ్‌లోని 469 గ్రామాల్లో 2,81,271 మంది, హైలకండిలోని 98 గ్రామాల్లో 51,000 మందికి పైగా ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. కాచర్ జిల్లాలోని 565 గ్రామాల్లో మొత్తం 2,32,002 మంది, కరీంగంజ్‌లోని 469 గ్రామాల్లో 2,81,271 మంది, హైలకండిలోని 98 గ్రామాల్లో 51,000 మందికి పైగా ప్రజలు వరదల కారణంగా చిక్కుకున్నారు. లోయలో వరద పరిస్థితిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ గురువారం సిల్చార్‌ను సందర్శించనున్నారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో మొత్తం జనాభా 54,57,601 మందిపై వరదలు తీవ్ర ప్రభావం చూపాయి. బార్‌పేట జిల్లాల్లో 11,29,390 మంది ప్రభావితమయ్యారు. కామ్‌రూప్‌లో 7,89,496 మంది, ధుబ్రీలో 5,97,153 మంది, నాగావ్‌లో 5,03,450 మంది ఉన్నారు. అసోం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎఎస్‌డిఎంఎ) గురువారం బులెటిన్ ప్రకారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సంభవించిన వచ్చిన వరదలతో 112 రెవెన్యూ సర్కిళ్లు, 4941 గ్రామాలను ప్రభావితమయ్యాయని, 2,71,125 మంది ప్రజలు 845 సహాయ శిబిరాల్లో తలదాచుకున్నారని పేర్కొంది. వరద బాధితులకు 1026 డెలివరీ పాయింట్ల నుంచి సహాయ సామగ్రిని పంపిణీ చేశారు. ఏఎస్‌డీఎంఏ బులెటిన్ ప్రకారం, డిమా హసావో జిల్లాలోని బెథానీ గ్రామంలో కొండచరియలు విరిగిపడ్డాయి. కరీంగంజ్‌లోని బర్తాల్ వద్ద వివిధ ప్రదేశాలలో 19 ఇళ్లు దెబ్బతిన్నాయి.

కామ్రూప్ జిల్లాలో రెండు కట్టలు తెగిపోవడంతో పాటు 218 రోడ్లు, 20 వంతెనలు దెబ్బతిన్నాయి. 99,026 హెక్టార్ల పంట విస్తీర్ణం, 33,17,086 జంతువులు దెబ్బతిన్నాయి. బక్సా, బిస్వనాథ్, బొంగైగావ్, చిరాంగ్, ధుబ్రి, కోక్రాజార్, లఖింపూర్, మజులి, మోరిగావ్, నల్బరి మరియు ఉడల్‌గురిలలో కూడా పెద్ద ఎత్తున కోత నమోదైందని ఏఎస్‌డీఎంఏ తెలిపింది.

'హిజాబ్' విద్యార్థుల్లో ఇద్దరికి ఎన్‌ఓసీ, ఒకరికి టీసీ

మంగళూరు : మంగళూరు కాలేజీలో హిజాబ్‌పై నిషేధానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థుల్లో ఇద్దరికి ఎన్‌ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్)లు ఇవ్వగా ఒకరికి మాత్రం టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్)ని యాజమాన్యం ఇచ్చింది. దీంతో వీరు వేరొక కాలేజీలో చేరవచ్చు. ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. క్యాంపస్‌లో యూనిఫారం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్న యూనివర్సిటీ నిర్ణయాన్ని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పాల్గొన్న వేరొక బాలిక కాలేజి యాజమాన్యానికి క్షమాపణ చెబుతూ లేఖ రాసి, ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతున్నట్లు ప్రిన్సిపల్ అనసూయ రాయ్ తెలిపారు. ఎంఎస్‌సీ (కెమిస్ట్రీ) చదువుతున్న కేరళకు చెందిన ముస్లిం విద్యార్థిని అనారోగ్య కారణాలతో టీసీ పొందినట్లు చెప్పారు. విద్యార్థులు వేరొక అండర్‌గ్రాడ్యుయేట్ కాలేజీలో చేరేందుకుగాను ఎన్‌ఓసీలు ఇచ్చామని, వారికి ప్రవేశం ఖరారైతే టీసీ ఇస్తామన్నారు.

గౌహతి ప్రధాన న్యాయమూర్తిగా రశ్మిన్ మన్‌హర్‌బాయి ఛాయ

గువహటి: గౌహతి ప్రధాన న్యాయమూర్తిగా రశ్మిన్ మన్‌హర్‌బాయి ఛాయతో అసోం గవర్నర్ జగదీశ్ ముఖి గురువారం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, అసోం అసెంబ్లీ స్పీకర్ బిశ్వజిత్ దైమారీ, గౌహతి హైకోర్టు జడ్జీలు, ఇంకా అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. 'రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రశ్మిన్ మన్‌హర్‌బాయి ఛాయ ప్రమాణస్వీకారం చేశారు' అని ముఖి ట్వీట్ చేశారు. ఇక్కడకు రాకముందు ఛాయ గుజరాత్ హైకోర్టు జడ్జిగా పనిచేశారు.

ముమ్మరంగా వాక్సిన్ బూస్టర్ డోస్

రాయ్‌పూర్: కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, వాక్సిన్ బూస్టర్ డోస్‌ల నిర్వహణను ముమ్మరం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను చీఫ్ సెక్రటరీ అమితాబ్ జైన్ గురువారం ఆదేశించారు. మూడు నెలల విరామం తర్వాత బుధవారం రాష్ట్రంలో రోజువారి కేసుల సంఖ్య 100 మార్కును దాటింది. రాష్ట్రంలో చివరిసారిగా మార్చి 4న ఒక్కరోజులో 100 కేసులు నమోదయ్యాయి. కరోనా నిబంధనలను తప్పకుండా పాటించాలని చీఫ్ సెక్రటరీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం 131 తాజా కరోనా వైరస్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 585 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

బొగ్గు కుంభకోణం... ఎంపీ భార్యను ప్రశ్నించిన ఈడీ

కోల్‌కతా: కోట్లాది రూపాయల బొగ్గు దోపిడీ కుంభకోణంపై విచారణకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ భార్య రుజీరా నరులా బెనర్జీని సిటీ కార్యాలయంలో విచారించినట్లు అధికారి తెలిపారు. రుజీరా, ఉదయం సుమారు 11 గంటల సమయంలో సీజీఓ కాంప్లెక్స్‌లోని ఈడీ కార్యాలయానికి తన కుమారుడితో వెళ్లారు. నలుగురు అధికారులు, వారిలో ఇద్దరు మహిళలు ఆమెను ప్రశ్నించారని అధికారి తెలిపారు. 'బ్యాంకాక్‌లోని బ్యాంక్ ఖాతాలో జరిగిన కొన్ని లావాదేవీల గురించి మేం ఆమెను ప్రశ్నించాం. అదే కేసులో ఇంతకుముందు విచారించిన వ్యక్తులు ఇచ్చిన సమాధానాలతో ఆమె సమాధానాలను సరిపోల్చుతున్నాం'అని అధికారులు వివరించారు. కోల్‌కతాలోని బొగ్గు స్మగ్లింగ్ కేసులో బెనర్జీ, అతని భార్యకు 24 గంటల ముందస్తు నోటీసు ఇవ్వడం ద్వారా వారిని ప్రశ్నించేందుకు సుప్రీం కోర్టు అనుమతించింది. చేయడానికి సుప్రీంకోర్టు అనుమతించింది.

కుమార్తెతో సహా తల్లి ఆత్మహత్య

సెరైకెలా: మూడేళ్ల కుమార్తెతోసహా తల్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జార్ఖండ్‌లోని సెరైకెలా ఖర్స్వాన్‌లో చోటుచేసుకున్నట్టు గురువారం పోలీసులు తెలిపారు. వీరి మృతదేహాలు గుట్టుసాయి గ్రామంలోని ఓ నిమ్మచెట్టుకు వేలాడుతూ కనిపించాయని పేర్కొన్నారు. 25 ఏళ్ల మహిళ తన ఇంటి వద్ద మంచినీటిని పట్టుకుంటున్న సమయంలో చూసినట్టు స్థానికులు చెప్పారని రాజ్‌నగర్ పోలీస్‌స్టేషన్ కార్యాలయ అధికారి చందన్ కుమార్ తెలిపారు. రెండు మృతదేహాలను సెరైకెలా సాదర్ ఆస్పత్రికి తరలించినట్టు పేర్కొన్నారు. మృతదేహాలను గుర్తించే సమయంలో మహిళ భర్త నిద్రలో ఉండగా, అతడిని విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నట్టు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక కోసం వేచిచూస్తున్నామని, అది వచ్చిన తరువాతే ఇది ఆత్మహత్యా, హత్యా తేలుతుందన్నారు.

కేజ్రీవాల్‌కు సంక్షేమంపై శ్రద్ధలేదు: బీజేపీ

న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు తాను ప్రాతినిథ్యం వహించే న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం పట్ల ఉదాసీనంగా ఉన్నారని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా గురువారం ఆరోపించారు. గుప్తా విలేకరులతో మాట్లాడుతూ... కేజ్రీవాల్ తన నియోజకవర్గంలో జరిగిన 21 జన్ సువిధ సమావేశాలలో ఒకదానికి మాత్రమే హాజరయ్యారు... ఇది తన నియోజకవర్గ ప్రజలపై ఆయనకున్న నిర్లక్ష్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఇక న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్డీఎంసీ) నాలుగు సమావేశాలకు ముఖ్యమంత్రి గైర్హాజరయ్యారని గుప్తా తెలిపారు. ఎన్డీఎంసీలో ఆస్పత్రులకు కేంద్రంగా ఉన్న ప్రాంతానికి నీటి సరఫరాను ఢిల్లీ ప్రభుత్వం తగ్గించిందని గుప్తా చెప్పారు. గతంలో, ఢిల్లీ జల్ బోర్డ్ (డీజేబీ) ఈ ఆసుపత్రులకు 124 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసేదని ఇప్పుడు 75 ఎంఎల్‌డీకి తగ్గించారని ఆయన ఆరోపించారు. బుధవారం జరిగిన ఎన్డీఎంసీ సమావేశంలో బీజేపీ సభ్యుడు కుల్జిత్ చాహల్... కేజ్రీవాల్ అనుమతి లేకుండా వరుసగా నాలుగు సమావేశాలకు గైర్హాజరవడాన్ని పేర్కొంటూ... ఆయన స్థానాన్ని 'ఖాళీ'గా ప్రకటించాలని తీర్మానం చేశారు.

27న రాజస్థాన్‌లో కాంగ్రెస్ నిరసనలు

జైపూర్: కేంద్రం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా రాజస్థాన్ కాంగ్రెస్ జూన్ 27న రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించనుంది. ఆర్మీ, నేవీ , ఎయిర్‌ఫోర్స్‌లో పదిహేడున్నర నుంచి 21 ఏళ్ల వయస్సు గల యువకులను నాలుగేళ్లపాటు కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకునేలా అగ్నిపథ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గత వారం ప్రకటించింది. దీనిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత రోడెక్కి నిరసన తెలుపుతున్న సంగతి తెలిసిందే. 'ఈ పథకాన్ని వ్యతిరేకిస్తున్న యువతకు కాంగ్రెస్ పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుంది. అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న యువత గళం దేశ ప్రధాన మంత్రి, హోంమంత్రికి వినిపించేలా మా వంతు కృషి చేస్తాము' అని రాష్ట్ర పార్టీ చీఫ్ గోవింద్‌సింగ్ దోతస్రా ఇక్కడ విలేకరులకు చెప్పారు. జూన్ 27న రాష్ట్రవ్యాప్తంగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అగ్నిపథ్‌పై కాంగ్రెస్ నిరసన తెలుపుతుందని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి రెండుసార్లు ఓటు వేసిన యువత మోసపోయినట్లు భావిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, సాయుధ బలగాలను నిర్వీర్యం చేయడమే కాక యువత డిమాండ్లను మోదీ సర్కారు విస్మరిస్తోందని దుయ్యబట్టారు. నైపుణ్యం కలిగిన నిరుద్యోగ యువతను కొంతమంది పారిశ్రామిక వేత్తలకు కట్టు బానిసలుగా చేసేందుకు సిద్ధమవుతోందని మండిపడ్డారు.

గ్రంథాలయాల్ని ఉపయోగించుకోండి: సీఎం యోగి

లక్నో : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, గ్రంథాలయాలను విరివిగా వినియోగించుకోవాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విద్యార్థులకు సూచించారు. యూపీ పదోతరగతి బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన 10 మంది విద్యార్థులతో లక్నోలోని తన నివాసంలో సమావేశమయ్యారు. విద్యార్థుల కోసం పీఎం మోదీ ప్రవేశ పెట్టిన పథకాలకు ధన్యవాదాలు తెలుపుతూ పోస్టుకార్డులు రాయాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నవారు గ్రంథాలయాలను సందర్శించాలని, వార్తాపత్రికలను క్రమం తప్పకుండా సూచించారు. వార్తాపత్రికలు చదవడం ద్వారా పోటీ పరీక్షలకు బాగా సన్నద్ధం కావచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి కోచింగ్ ఇవ్వడం కోసం అభ్యుదయ అనే పథకాన్ని ప్రవేశ పెట్టినట్టు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

న్యూదిల్లీ: తమ డిమాండ్లపై చర్చలు జరపడానికి ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ) అంగీకరిం చడంతో జూన్ 27న తలపెట్టిన సమ్మెను బ్యాంక్ యూనియన్లు గురువారం వాయిదా వేసుకున్నాయి. పెన్షన్‌కు సంబంధించిన సమస్యలు, వారానికి ఐదు రోజుల పనిదినాల డిమాండ్ కోసం సమ్మెకు దిగుతున్నట్లు అఖిలభారత బ్యాంకు అధికారుల సమాఖ్య(ఏఐబీఓసీ), అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ), బ్యాంకు ఉద్యోగుల జాతీయ సంఘం(ఎన్‌ఓబీడబ్ల్యూ) సహా 9 బ్యాంకులు ఇప్పటికే హెచ్చరించాయి. ఈ సంఘాలన్నీ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ (యూఎఫ్‌బీయూ) పేరుతో ఒక్కటై సమ్మెకు పిలుపునిచ్చిన విషయం విదితమే. ఐబీఏతో కుదిరిన ఒప్పందం ప్రకారం పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలపై జులై ఒకటిన చర్చలు జరుగుతాయని ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం చెప్పారు. చీఫ్ లేబర్ కమిషనర్ అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం వెంకటాచలం ఈ వివరాలు వెల్లడించారు.

ఎస్కేయూ అక్రమాలపై చర్యలు తీసుకోండి

ఉన్నత విద్యాశాఖ సీఎస్ శ్యామలరావుకు ఏఐఎస్ఎఫ్ వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎస్కేయూలో కాంట్రాక్ట్ యూజీసీ టెన్త్ ప్లాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అక్రమ క్రమబద్ధీకరణ, పదోన్నతులు రద్దు చేయాలని, దూరవిద్యా కేంద్రంలో అడ్వాన్సు రూపంలో తీసుకున్న నిధులను ప్రొ.శంకర్ నాయక్, ప్రొ.అంజనేయులు నుండి రికవరీ చేయాలని కోరుతూ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి శ్యామలరావుకు ఏఐఎస్ఎఫ్ నేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు అంకన్న మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 2005 యూజీసీ టెన్త్ ప్లాన్‌లో మంజూరైన 8 కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలు చేపట్టారు. అప్పటి వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూనివర్సిటీ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎలాంటి రోస్టర్ పట్టించకుండా పోస్టులు భర్తీ చేశారు. ఆ తరువాత 2008లో అప్పటి వైస్ చాన్సలర్ పి.కుసుమకుమారి టెన్త్ ప్లాన్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి లక్షలాది రూపాయలు వసూలుచేసి యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా నియామకాలను క్రమబద్ధీకరించారు. ఈ అవినీతి, అక్రమాలపై విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య ప్రధాన కార్యదర్శి సురేశ్ చందా, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. కేసీ రెడ్డితో విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ విచారించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరించిన టెన్త్‌ప్లాన్ పోస్టులను రద్దు చేయాలని, 2009లో జారీ చేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నోటిఫికేషన్ రద్దు చేసి, ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించారు. ఆ ఆదేశాలను ధిక్కరించి 2009లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి 23 మందికి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాల కోసం ప్రొ.కుసుమకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వం ఈ అవినీతి, అక్రమాలపై హైకోర్టు జడ్జి హను మంతుతో న్యాయ విచారణ చేసి... కుసుమకుమారిని వైస్ చాన్సలర్ పదవి నుండి తొలగిస్తూ, ఈ అక్రమ నియామకాలు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కుసుమ కుమారిని తొలగించినప్పటికీ అక్రమ నియామకాలు పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ నియామకాలను కొనసాగించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు ఇంకా కోర్టులో కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుత వైస్ చాన్సలర్ రామకృష్ణారెడ్డి అక్రమ పద్ధతిలో నియామకాలు పొందిన టెన్త్‌ప్లాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్...అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించాలని కోరుతూ ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశం అజెండాలో ప్రతిపాదన చేశారు. పాలకమండలి ఈ ప్రతిపాదనను తిరస్కరించింది.యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణకుమారి, ఉన్నత విద్యాశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సతీశ్ చంద్ర ఈ నియామకాలన్నీ యూజీసీ, యూనివర్సిటీ చట్టం 1991 చట్టానికి విరుద్ధంగా జరిగాయని, ఆ నియామకాలను రద్దు చేయాలని ఏపీ హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. వైస్ చాన్సలర్ రామకృష్ణారెడ్డి అక్రమ పద్ధతుల్లో నియామకాలు పొందిన ఏడుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సీఏఎస్ ద్వారా అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ అక్రమ పదోన్నతులను తిరస్కరించాలని, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు రద్దు చేసి...కొత్త నోటిఫికేషన్‌కు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాని కోరారు. దూరవిద్య కేంద్రంలో అడ్వాన్స్‌గా నిధులు తీసుకున్న ప్రొ.శంకర్ నాయక్, ప్రొ.అంజనేయులు నుండి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. శంకర్ నాయక్ రు.2.59కోట్లు తీసుకొని కేవలం రూ.49 లక్షలకి మాత్రమే బిల్లులు సమర్పించారు. మిగిలిన రూ.2.09 కోట్ల బిల్లులు సమర్పించలేదని విద్యార్థి నాయకులు తెలిపారు. అంజనేయులు రూ.60 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకొని కేవలం రూ.13 లక్షలకే బిల్లులు సమర్పించినట్లు వివరించారు. వారిద్దరికీ వైస్ చాన్సలర్ వత్తాసు పలుకుతూ ముడుపులు తీసుకొని నో డ్యూస్ పై సంతకాలు చేయాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీ నిధులు దుర్వినియోగం చేసేలా వైస్ చాన్సలర్ వ్యవహరిస్తున్నారని, తక్షణమే ఆ నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. యూజీసీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో జూనియర్ లైబ్రరీ అసిస్టెంట్ పోస్టులు డైరెక్ట్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బ్రాండెక్స్ ప్రమాదంపై వాస్తవాలు వెల్లడించండి

కలెక్టరుకు జేవీ సత్యనారాయణమూర్తి విజ్ఞప్తి

విశాలాంధ్ర-అనకాపల్లి: అచ్యుతాపురంలోని బ్రాండెక్స్‌లో జరిగిన విషవాయువు ప్రమాదంపై వాస్తవాలు బయటపెట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. బ్రాండెక్స్‌లో ఈ నెల 3న విషాద ఘటన జరిగింది. కంపెనీ నుండి వచ్చిన విషవాయువు ప్రభావం వలన వందలాది మంది మహిళా కార్మికులు స్పృహకోల్పోయి అస్వస్థతకు గురై వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందారు. ఇప్పటికీ చాలామంది ఆ విషవాయువు ప్రభావం నుంచి పూర్తిస్థాయిలో కోలుకోలేదు. హడావుడిగా మంత్రులు, జిల్లా అధికారులు బ్రాండెక్స్‌ను సందర్శించి విషవాయవు పీల్చడం వలనే మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారని ప్రకటన చేశారు. కమిటీ వేశామని, ప్రమాదంపై నివేదిక ఇస్తారని చెప్పి నేటికి 20 రోజులు గడుస్తుంది. అయినప్పటికీ ఇంకా నివేదిక కాదు కాదా..ఆ విషయాన్నే ప్రభుత్వం పక్కన పెట్టేసింది. అమ్మోనియా వాయువు వలన ప్రమాదం జరిగిందని ఒకసారి, క్లోరిన్ వలన అని మరోసారి చెప్పారు. పోరస్ లేబరేటరీని తాత్కాలికంగా మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. 24 మంది శాస్త్రవేత్తలు పరిశీలన చేసి విషవాయువు లీకేజీ దాఖలాలు లేవని తేల్చారు. ఫోరస్- బ్రాండెక్స్‌కు 1.5 కిలో మీటర్ల పరిధిలో చెట్లకు విషవాయువు ప్రభావం లేదని తేల్చారు. అధికారులు వాస్తవ విరుద్ధ ప్రకటనలు చేశారని చెప్పారు. ఘటనపై నిజనిజాలు బయటపెట్టకుండా తాత్సారం చేయడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని, అన్ని వర్గాలకు అనేక అనుమానాలు ఉన్నాయని, అసలు విషయాలు బయటపెట్టాలని కలెక్టర్‌ను జేవీ సత్యనారాయణమూర్తి సహా సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, సమితి సభ్యులు వైఎస్ భద్రం కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వియ్యపురాజు తదితరులు ఉన్నారు.

పది రోజులు టిడ్కో సంబరాలు

- **పంపిణీకి సిద్ధంగా 30 వేల ఇళ్లు**
- **డిసెంబరు నాటికి 2.62 లక్షల ఇళ్లు అందిస్తాం**
- **మంత్రులు ఆదిమూలపు సురేశ్, బొత్స సత్యనారాయణ**

టిడ్కో గృహాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఆదిమూలపు సురేశ్, బొత్స

విశాలాంధ్ర -విజయనగరం: అన్ని వసతులతో కూడిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ చెప్పారు. పది రోజులపాటు టిడ్కో సంబరాలు నిర్వహించి పూర్తయిన ఇళ్లను ప్రారంభించినున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమాన్ని గురువారం విజయనగరం జిల్లా నుంచే మొదలుపెట్టినట్టు పేర్కొన్నారు. వచ్చే పదిరోజుల్లో రాష్ట్రంలో 30వేల ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దశల్లో నిర్మాణంలో వున్న టిడ్కో ఇళ్లలో 1.32 లక్షల ఇళ్లను ఆగస్టు, సెప్టెంబరు నాటికి, డిసెంబరు నాటికి 2.62 లక్షల ఇళ్లను అన్ని వసతులతో పూర్తిచేసి అందజేస్తామన్నారు. టిడ్కో ఇళ్లపై రూ.10 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. విజయనగరం పట్టణంలోని సారిపల్లి సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాల సముదాయాన్ని మంత్రి ఆదిమూలపు సురేశ్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో కలసి ప్రారంభించారు. 800 ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికల ముందు టిడ్కో ఇళ్లను పూర్తిచేసి ప్రారంభిస్తున్నట్టు హడావిడి చేసిందని విమర్శించారు.. 300 చదరపు అడుగుల ఇంటికి గత ప్రభుత్వం రూ.2.65 లక్షలు బ్యాంకు రుణం తీసుకోవాలని, లబ్ధిదారు రూ. 500 డిపాజిట్ చెల్లించాలని నిబంధన విధించగా సీఎం జగన్ పేదలపై భారం పడకూడదని కేవలం ఒక్క రూపాయితో రూ.6.50 లక్షల ఇళ్లను ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ధనికులతో సమానంగా పేదలూ అన్ని వసతులతో జీవించేలా ప్రభుత్వం ఎంతో ఖర్చుచేసి టిడ్కో ఇళ్లను నిర్మించి ఉచితంగా అందిస్తోందన్నారు. టిడ్కో కాలనీల్లో మౌళిక వసతులకు ఒక్కో ఇంటిపై లక్ష రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. సారిపల్లి టిడ్కో కాలనీలో సచివాలయం, ఆసుపత్రి తదితర అన్ని వసతులూ కల్పిస్తామని, ఇళ్లు పొందిన వారంతా ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో నివాసం వుండాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న 3,776 ఇళ్లను దశల వారీగా పూర్తి చేసి వచ్చే డిసెంబరు నాటికి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు రఘు రాజు, సురేశ్‌బాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, జిల్లా కలెక్టర్ ఏ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగర కార్పొరేటర్లు, మునిసిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు, టిడ్కో ఎండి, డైరక్టర్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప ఎన్నికలు

న్యూదిల్లీ: ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో మూడు లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలకు గురువారం ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల బరిలో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా కూడా ఉన్నారు. దిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, త్రిపుర, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్‌లో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. యూపీలోని అజంఘర్, రామ్‌పూర్, పంజాబ్‌లోని సంగ్రూర్ లోక్‌సభ స్థానాలకు , రాజేంద్ర నగర్, జార్ఖండ్‌లోని మందర్, ఆంధ్రప్రదేశ్‌లోని ఆత్మకూరు, త్రిపురలోని అగర్తలా, టౌన్‌బోర్డోవాలీ, సుర్మా, జుబ్‌రాగ్ అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరిగింది.

ఎన్ఐఏ తనిఖీలు... ముగ్గురి అరెస్టు

హైదరాబాద్: మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న అభియోగాలతో చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) నాయకులు దేవేంద్ర, స్వప్న, హైకోర్టు న్యాయవాది శిల్పను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేశారు. మూడేళ్ల క్రితం తమ కుమార్తెను కిడ్నాప్ చేశారని 2017 డిసెంబరులో విశాఖలోని పెదబయలు పీఎస్‌లో రాధ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎంఎస్ నాయకులు... రాధను కిడ్నాప్ చేసి బలవంతంగా మావోయిస్టు పార్టీలో చేర్చుకున్నారని ఆమె తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎంఎస్ నాయకులు దేవేంద్ర, స్వప్న, హైకోర్టు న్యాయవాది శిల్ప, తదితరులు తమ నివాసానికి వచ్చేవారని తెలిపారు. వైద్యం పేరుతో దేవేంద్ర.. రాధను తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విశాఖ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు శిల్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గురువారం ఉదయం ఉప్పల్ చిలుకానగర్‌లోని శిల్ప నివాసంలో, చైతన్య మహిళా సంఘం కార్యాలయంలో సోదాలు నిర్వహించిన ఎన్ఐఏ అధికారులు డిజిటల్ సామగ్రి, మావోయిస్టు భావజాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మెదక్ జిల్లా చేగుంటలోని మావోయిస్టు అగ్రనేత దుబాషి శంకర్ కుమారుడి ఇంట్లో తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహించారు. గతంలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ప్రభాకర్ భార్య, న్యాయవాది దేవేంద్రను మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి పర్వతాపూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. దేవేంద్ర, స్వప్న, శిల్ప ముగ్గురూ మావోయిస్టు అనుబంధ సంస్థ చైతన్య మహిళా సంఘంలో పనిచేస్తున్నట్టు ఎన్ఐఏ అధికారులు నిర్ధారణకు వచ్చారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-కదిరి: పంజాబ్‌లోని జలంధర్ సిటీ యూనివర్సిటీలో జరిగిన 11వ ఓవినం నేషనల్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని కదిరి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారు. ఏపీ ఓవినం ఇన్‌చార్జ్, కరాటే మాస్టర్ షేక్షావలి అధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా నుంచి 20మంది కదిరి విద్యార్థులు పాల్గొన్నారు. వీరు తప్పుత క్యూన్, లాంగ్ హోం క్యూన్, సింగల్ స్టిక్ విభాగాల్లో తమ ప్రతిభ ప్రదర్శించారు. ఏపీకి మొత్తం నాలుగు బంగారు, 10 వెండి, 10 కాంస్య పతకాలు సాధించారు. మొత్తంగా రాష్ట్రానికి 24 పతకాలు వచ్చాయి. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఓవినం ఇంటర్నేషనల్ టెక్నికల్ డైరెక్టర్ వియాత్నం దేశానికి చెందిన ట్యాంగ్, జాతీయ ఓవినం అధ్యక్షుడు సాహు, జాతీయ కార్యదర్శి శంకర్, మహాబలిల చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఫైట్ భాగంలో సిరి బంగారు పతకంతోపాటు, 51 కిలోల ఫైట్ విభాగంలో ఓవరల్ బెస్ట్ ఫైటర్ ఆఫ్ ది అవార్డు సాధించింది. 15 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనగా, కదిరికి చెందిన సోహిత్ తప్పుత క్యూన్ విభాగంలో 233 ఉత్తమమైన స్కోర్‌తో దూసుకెళ్లి బంగారు పతకం సాధించాడు. సింగల్ స్టిక్ విభాగంలో యశస్విని, నికితలకు బంగారు పతకాలు వచ్చాయి. గర్ల్స్ లాంగ్ హోం క్యూన్ విభాగంలో శృతి, నదియా తబస్సుమ్, వెండి పతకాలు సాధించారు. బాలుర తప్పుత క్యూన్ విభాగంలో సోహిత్ బంగారు పతకం సాధించగా, రిహాన్, ప్రగ్నేష్, నిరంజన్, నూర్, వెండి పతకాలు సాధించారు. కిరణ్, మన్విత్ ఏజ్, జస్వంత్, జయంత్, నితీష్, జగదీష్, కాంస్య పతకాలు సాధించారు. బాలుర ఫైట్ విభాగంలో సోహిత్, వాసు, ప్రగణేష్, అభిలాష్ వెండి పతకాలు సాధించగా, సయ్యద్ బాషా కాంస్య పతకం సాధించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంవీఏ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధం

24 గంటల్లో అసమ్మతి నేతలంతా ముంబైకి రావాలి: రౌత్

ముంబై: రెండు రోజులుగా మహారాష్ట్ర రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. గంటగంటకు అనూహ్య పరిణామాలతో సంకీర్ణ ప్రభుత్వం పతనం అంచులకు చేరుకుంది. ఈ నేపథ్యంలో శివసేన అధికార ప్రతినిధి, ఎంపీ సంజయ్ రౌత్ అసమ్మతి నేతలకు సరికొత్త ఆఫర్ ఇచ్చారు. 24 గంటల్లో వారంతా ముంబైకి తిరిగి వచ్చేస్తే.. మహావికాస్ అఘాడీ(ఎంవీఏ) నుంచి శివసేన బయటకు వచ్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ప్రస్తుతం శివసేన అసమ్మతి నేత ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో 40 మందికి పైగా ఎమ్మెల్యేలు అసోంలోని గువాహటిలో ఉన్నారు. వారంతా తొలిసారి మీడియా ముందుకు వచ్చి బలప్రదర్శన నిర్వహించారు. తనకు శివసేన ఎమ్మెల్యేలతో పాటు స్వతంత్రుల మద్దతు కూడా ఉందని షిండే వెల్లడించారు. మరోపక్క ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నిర్వహించిన సమావేశానికి ఆదిత్య ఠాక్రే సహా 13మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరైనట్లు సమాచారం. మొత్తం ఆ పార్టీకి 55 మంది అసెంబ్లీ సభ్యులుండగా.. 13 మందే హాజరుకావడం చూస్తుంటే.. పార్టీలో చీలిక ఖాయంగా కనిపిస్తోంది. ఈ తరుణంలో సంజయ్ రౌత్ చేసిన ఆఫర్ మహారాష్ట్ర రాజకీయాల్లో పెద్ద ట్విస్ట్‌గా మారింది. "మేం శివసైనికులం' అని మీరు చెబుతున్నారు. పార్టీని వీడేది లేదంటున్నారు. ముంబై వెలుపల ఉన్న ఈ అసమ్మతి నేతలు హిందుత్వ అంశాన్ని లేవనెత్తారు. మీకు ప్రభుత్వంతోనే సమస్యలున్నాయంటున్నారు. ఈ ఎమ్మెల్యేలంతా శివసేన పార్టీ ఎంవీఏ నుంచి బయటకు రావాలని కోరుకుంటే.. ముంబైకి వచ్చే ధైర్యం చేయండి. 24 గంటల్లో మీరు ముంబైకి తిరిగి వచ్చి, సీఎం ఉద్ధవ్ ఠాక్రేతో చర్చిస్తే.. మీ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. మీ డిమాండ్‌ను సానుకూలంగా తీసుకుంటాం. ట్విట్టర్, వాట్సాప్‌లో లేఖలు రాయకండి' అంటూ రౌత్ సూచించారు.

'దుల్హాన్' అమలు చేయలేం

- **ఆర్థిక ఇబ్బందులతోనే పథకాన్ని నిలిపివేశాం**
- **హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం**

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ యువతులకు వివాహం సందర్భంగా ఆర్థిక సహాయం అందజేసే ఉద్దేశంతో గత తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన దుల్హన్ పథకాన్ని అమలు చేయలేమని వైసీపీ ప్రభుత్వం తెలిపింది. ఆర్థిక ఇబ్బందులతోనే దుల్హన్ పథకాన్ని నిలిపివేశామని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఇది రాష్ట్రంలో అమలులో లేదని తెలియజేసింది. ముస్లిం యువతుల వివాహానికి అప్పట్లో టీడీపీ ప్రభుత్వం రూ.50 వేలు ఇచ్చేది. ఆ ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచుతామని గత ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వం ఆ హామీ విస్మరించడంతో పాటు, గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.50వేలు కూడా ఇవ్వకుండా పథకాన్ని పూర్తిగా నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు షారూఖ్ షిబ్లి హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. దీంతోపాటు విదేశీ విద్యా పథకం సైతం నిలుపుదల చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం మైనార్టీల ఉన్నత విద్య కు రూ.15 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించింది. 2018-2019 ఆర్థిక సంవత్సరాల్లో విదేశాలకు వెళ్ళి ఉన్నత విద్య అభ్యసించిన 574 మందికి ఇప్పటికీ సాయం విడుదల కాలేదు. ఎస్సీ, బీసీలకు ఆయా సంక్షేమ శాఖల ద్వారా నిధులు విడుదల చేస్తూ ముస్లిం మైనార్టీలకు మాత్రం అన్యాయం చేస్తున్నారని పిటీషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు వివరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై గురువారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆర్థిక ఇబ్బందులు కారణంగానే పథకాన్ని నిలిపివేశామని తెలియజేశారు. వాదనలు విన్న ధర్మాసనం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

యువత కన్నీటిలో మోదీ కొట్టుకుపోతారు: రాహుల్

న్యూదిల్లీ: అగ్నిపథ్ పథకానికి సంబంధించి బీజేపీపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ విమర్శలు ఎక్కుపెట్టారు. దేశానికి సేవ చేయాలన్న లక్షలాది మంది యువత కలలను మోదీ సర్కారు వమ్ము చేసిందని మండిపడ్డారు. యువత కన్నీరు ఓ ఉప్పెనలా మారి ప్రధాని నరేంద్రమోదీ అధికార అహంకారాన్ని దించేస్తుందని రాహుల్ వ్యాఖ్యానించారు. సాయుధ బలగాల్లో చేరాలన్న అవకాశాన్ని కోల్పోయిన ఓ యువకుడు కన్నీరు కారుస్తూ కేంద్రంపై మండిపడిన ఓ వీడియోను రాహుల్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. రెండేళ్లుగా సాయుధ బలగాల్లో ఎలాంటి నియా మాలు చేపట్టలేదని రాహుల్ విమర్శించారు. నాలుగేళ్ల కాంట్రాక్టు పద్ధతిలో అగ్నివీర్‌లను తీసుకురావడం ద్వారా దేశానికి సేవ చేయాలన్న లక్షలాదిమంది యువత కలలను బీజేపీ చెరిపేసిందని, నిరుద్యోగ యువత కన్నీటి వరదలో మోదీ అధికార అహంకారం అణిగిపోతుందని రాహుల్ పేర్కొన్నారు.

'ఇన్-సర్వీస్ కోటా సీట్ల'పై పిటిషన్ తిరస్కృతి

న్యూదిల్లీ: తమిళనాడు రాష్ట్రం ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ)కి అప్పగించిన నీట్ సూపర్ స్పెషాలిటీ 2021కి చెందిన 92 'ఇన్-సర్వీస్ కోటా సీట్ల'ను కొత్తగా జోడించిన సీట్లలో కలపాలని, మునుపటి రౌండ్‌లలో చేరిన వారితో సంబంధం లేకుండా అభ్యర్థులందరికీ ఆయా సీట్లను అందుబాటులో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. న్యాయమూర్తులు సి.టి.రవికుమార్, సుధాన్సు ధులియాతో కూడిన వెకేషన్ బెంచ్... అంతకుముందు సీట్లలో చేరిన ఏ వైద్యుడు కూడా చేరకూడదన్న షరతుతో మే9న అత్యున్నత న్యాయస్థానం భర్తీ చేయని ఖాళీగా ఉన్న అన్ని సూపర్-స్పెషాలిటీ సీట్లకు మాప్-అప్ రౌండ్‌కు ఉన్నత న్యాయస్థానం అనుమతించిందని, నిర్దిష్ట దిశ ఉన్నప్పుడు తాము తీర్పునకు వ్యతిరేకంగా వెళ్లలేమని స్పష్టం చేసింది. ఎంపీ కవియరసన్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. మే 9, 2022న తమిళనాడు తరపున హాజరైన న్యాయవాది...రాష్ట్రంలోని ఇన్-సర్వీస్ కోటాలో భర్తీ చేయని 92 సీట్లను ఈ సంవత్సరం ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ)కి సరెండర్ చేస్తామని సుప్రీంకోర్టుకు చెప్పారు. అప్పుడు సూపర్ స్పెషాలిటీ మెడికల్ కోర్సుల అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయడానికి మాప్ అప్ రౌండ్ నిర్వహించనున్నట్లు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపారు. ఈ సందర్భంగా తమిళనాడు 92 సీట్లను ఏఐక్యూకి అప్పగించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.